మార్గదర్శి నన్నయభట్టు

దేవులపల్లి రామానుజరావు

అంతర్జాతీయ తెలుగు సంస్థ

హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్

ఇండియా

మార్గదర్శి నన్నయభట్టు

దేవులపల్లి రామానుజరావు

అంతర్జాతీయ తెలుగు సంస్థ
హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్
ఇ ం డి యా

ప్రతులు-2000

1982

మూల్యం 2-50

ప్రతులకు :

డైరెక్టరు, అంతర్జాతీయ తెలుగు సంస్థ
నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాదు,
ఆంధ్రప్రదేశ్

తొలిపలుకు

భారతీయ సాహిత్యంలో తెలుగు సాహిత్యానికి కొన్ని ప్రత్యేకతలున్నవి. తెలుగు భాషలో వేయి సంవత్సరాలకు మించిన సాహిత్యం ఉన్నది. మనదేశ భాషల్లో తమిళ, కన్నడాలకు మాత్రమే యింతటి ప్రాచీన సాహిత్యం ఉన్నది. తెలుగులో గద్య పద్య రచన క్రీ॥ పూ॥ 4, 5. శతాబ్దాలలోనే ప్రారంభమైనప్పటికి తెలుగు శాసనాల్లో ఉత్తమ కవిత్వం మనకు లభిస్తున్నప్పటికీ, గ్రంథ రూపమైన కావ్యాన్ని మొట్టమొదటి సారిగా రూపొందించిన గౌరవం నన్నయ భట్టుకే ఇవ్వవలసి ఉన్నది. అందుచేతనే ఆయనను ప్రథమాంధ్ర కవి అని పేర్కొనడం కలదు.

క్రీ॥ శ॥ 11 వ శతాబ్దంలో ప్రస్తుతం రాజ మహేంద్రవరంగా ప్రసిద్ధిగాంచిన వేంగీ పట్టణం రాజధానిగా తెలుగుదేశాన్ని పరిపాలించిన రాజనరేంద్రుని కోరిక మీద నన్నయభట్టు సంస్కృత భారతాన్ని తెనిగించడానికి పూనుకున్నాడు. అప్పటి వరకు తెలుగులో లిఖిత రూపమైన కావ్యం ఏమీ లేదు. వైదిక మతోద్ధరణమే భారతాంధ్రీకరణ ప్రధాన ఆశయ మని రాజరాజ నరేంద్రుడు, నన్నయ భావించినారు. ఇందు కనుగుణంగా భారత రచన నన్నయ సాగించినాడు. నన్నయ గొప్ప విద్వాంసుడు, అవిరళ జపహోమ తత్పరుడు, నిత్యసత్య వచనుడు, నానా పురాణ విజ్ఞాన నిరతుడు మత్యమరాధి పాచార్యుడు. అందు చేత మహాభారత రచనకు సర్వవిధాల ఆయనే యోగ్యుడని రాజ నరేంద్రుడు అభిప్రాయపడినాడు. రాజనరేంద్రుని ఆస్థానంలో మరో

విద్వాంసుడు అయిన నారాయణభట్టు సహాయంతో ఆది, సభాపర్వాలు, అరణ్య పర్వంలో 3 అశ్వాసాలు నన్నయ ఆంధ్రీకరించినాడు. మొట్ట మొదటిసారి తెలుగులో లిఖిత సాహిత్యానికి, కావ్య రచనకు దారి చూపిన నన్నయభట్టును శబ్దాను శాసనుడుగా, ఆదికవిగా తర్వాతి తెలుగు కవులందరూ ప్రశంసించినారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గడిచిన సంవత్సరం పోతన పంచశతి జయంతి ఉత్సవాలు నిర్వహించి ఆ సంవత్సరాన్ని పోతన సంవత్సరంగా నిర్ణయించింది. అదే విధంగా ఈ సంవత్సరాన్ని నన్నయ సంస్మరణ సంవత్సరంగా నిర్ణయించింది. ఇప్పటికి నన్నయ భారత రచన జరిగి తొమ్మిది నూర్ల (900) సంవత్సరాలు గడచి పోయినవి. ఈ సందర్భంలో నన్నయ సారస్వతమూర్తిని రాష్ట్రేతరాంధ్రులకు విదేశాల్లో నివసించే తెలుగు వారికి పరిచయం చేసే ఉద్దేశంతో యీ చిన్న పుస్తకాన్ని అంతర్జాతీయ తెలుగు సంస్థ ఆంధ్ర మహాజనులకు అందజేస్తున్నది. అంతర్జాతీయ తెలుగు సంస్థతో మొదటి నుంచి సంబంధం కలిగి తెలుగు పాఠకలోకానికి సుపరిచితులైన శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు మా కోరిక ప్రకారం యీ చిన్న గ్రంథాన్ని వ్రాసినందుకు ధన్యవాదాలు.

ఈ పుస్తకాన్ని హిందీ, ఇంగ్లీషు, భాషల్లో కూడ అనువదించి తెలుగు రాని పాఠకులకు, సారస్వతాభిమానులకు, విద్వాంసులకు నన్నయను పరిచయం చేయవలెనని అంతర్జాతీయ తెలుగు సంస్థ నిర్ణయించింది.

హైదరాబాదు

28-11-1982

వందేమాతరం రామచంద్రరావు

అధ్యక్షులు

మా మాట

వివిధ దేశాలలో నివసించే తెలుగువారు, రాష్ట్రేతరాంధ్రులు 1975వ సంవత్సరం ఏప్రిలు నెలలో మొట్టమొదటిసారి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో ప్రథమ ప్రపంచ మహాసభల సందర్భంగా సమావేశమైనారు. ఆనాటి ఆ సమావేశపు వేదిక సకల ప్రపంచ స్థాయి తెలుగు వేదికగా రూపొందింది. ఈ వేదిక మీదనే రాష్ట్రేతర ప్రాంతాలలోను, విదేశాలలోను నివసించే తెలుగు వారి సాంస్కృతిక అవసరాలను గుర్తించి వాటిని తీర్చడానికి అవసరమైన ప్రయత్నాలు చేయవలెననే ఉద్దేశాన్ని యీ సమావేశంలోని ప్రతినిధులు ప్రకటించినారు. ఈ ఉద్దేశానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతర్జాతీయ తెలుగు సంస్థను నెలకొల్పింది.

గడచిన ఏడు సంవత్సరాల్లో అంతర్జాతీయ తెలుగుసంస్థ, తన ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించుకొని ముందడుగు వేస్తున్నది. రాష్ట్రేతర ప్రాంతాలలో ఉపాధ్యాయ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ, తెలుగువాణి పత్రికను ప్రకటిస్తూ, రాష్ట్రేతరాంధ్రులకు, విదేశాల్లో తెలుగు వారికి అవసరమైన పుస్తకాలను వెలువరిస్తూ అంతర్జాతీయ తెలుగు సంస్థ పురోగమిస్తున్నది. రాష్ట్రేతర ప్రాంతాలలో సాహిత్య, సాంస్కృతిక వైజ్ఞానిక సమావేశాలను అంతర్జాతీయ తెలుగు సంస్థ నిర్వహిస్తున్నది.

మహాకవుల సంస్మరణ ఉత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహించి ఒక్కొక్క సంవత్సరాన్ని ఒక్కొక్క కవికి అంకితం చేయవలెనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించి గడచిన సంవత్సరాన్ని పోతన సంవత్సరంగా ప్రకటించినందున అంతర్జాతీయ తెలుగు సంస్థ గత సంవత్సరం పోతన స్మారక సభలు ఢిల్లీలో నిర్వహించింది. ఈ సంవత్సరం నన్నయ సభలు కలకత్తా, బరంపురం, భువనేశ్వర్, పూనా, మద్రాసు, హోసూరులలో జరపాలని అంతర్జాతీయ తెలుగు సంస్థ నిర్ణయించింది. ఈ సందర్భంగా నన్నయను రాష్ట్రేతరాంధ్రులకు పరిచయం చెయ్యడానికి యీచిన్న పుస్తకం వెలువరిస్తున్నది. సంస్థ పుట్టిన నాటి నుంచి సంస్థ కార్యకలాపాలతో అతి సన్నిహిత సంబంధాలున్న మిత్రులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు కోరిన వెంటనే యీ చిన్న గ్రంథాన్ని వ్రాసి యిచ్చినందుకు మా ధన్యవాదాలు.

హైదరాబాదు
28-11-1982

మాటేటి రామప్ప
డైరెక్టరు

నా మాట......

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్కొక్క సంవత్సరాన్ని ఒక్కొక్క తెలుగుకవి నామాంకితం చేసి సంస్మరణ సభలను, సాహిత్య వేదికలను నిర్వహించే సత్సాంప్రదాయాన్ని నెలకొల్పినది. గడచిన సంవత్సరము, అనగా ఒకటవ జూలై ౧౯౮౧ నుంచి ౩౦వ జూను, ౧౯౮౨ వరకు పోతన సంవత్సరం కాగా—ఈసంవత్సరం, అనగా ఒకటవ జూలై, ౧౯౮౨ నుంచి ౩౦వ జూను, ౧౯౮౩ వరకు నన్నయ సంవత్సరంగా ప్రకటితమైనది.

ఆంతర్జాతీయ తెలుగు సంస్థ పక్షాన నన్నయ సంస్మరణం సముచితముగా చేయవలెనని నిశ్చయించి, తెలుగు పొలిమేరల వెలుపల భారతదేశంలో నివసించే తెలుగు సారస్వత ప్రియులకు, విదేశాలలో నివసించే తెలుగు సాహిత్యాభిమానులకు నన్నయ సారస్వత మూర్తిని సందర్శించడానికి ఉపయోగకరంగా ఉండే చిరుపొత్తము నొకదానిని ప్రచురించవలెనని నిర్ణయించి ఆ బాధ్యతను నాకు అప్పగించినది. అంతర్జాతీయ తెలుగు సంస్థ అధ్యక్షులు, నాకు ఆదరణీయులు శ్రీ వందేమాతరం రామచంద్రరావుగారు, సంస్థ డైరెక్టర్, నాకు చిరకాల స్నేహితులు శ్రీ మాటేటి రామప్పగారు చేసిన ఒత్తిడికి తట్టుకొనజాలక నేను యీ పనికి

సాహసించినాను. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి డాక్టర్ దాశరథిగారి ప్రోత్సాహం ఇందుకు తోడైనది. ఈ గ్రంథం అంతర్జాతీయ తెలుగు సంస్థ ఉద్దేశానికి అనుగుణంగా ఉండగలదని ఆశిస్తున్నాను.


ఈగ్రంథాన్ని హిందీ, ఇంగ్లీషు భాషలలో పరివర్తనం చేయవలెనని అంతర్జాతీయ తెలుగు సంస్థ నిర్ణయించినది. ఈ పుస్తకాన్ని వ్రాసే సందర్భంలో యీ నిర్ణయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవడం జరిగింది.

ఈ గ్రంథం వ్రాతప్రతిని చూచి తగు సూచనలిచ్చిన ఆంధ్ర సారస్వత ప్రాచ్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కె. రంగనాథాచార్యుల గారికి నా ధన్యవాదాలు. ఈ వ్రాతప్రతిని సిద్ధంచేసి నాకు యథాప్రకారం తోడ్పడిన యువకమిత్రుడు శ్రీబుద్ధపురం జగన్మోహనరావు.

౧.౧౧.౧౯౮౭

హైదరాబాదు

దేవులపల్లి రామానుజరావు



సన్యాసి - మాజీ చిత్రం

మార్గదర్శి నన్నయభట్టు

భారతీయ సాహిత్యం - జీవనది

భారతీయ సాహిత్యం ఆసేతుహిమాచలము ప్రవహించే ఒక మహానది; ఒక జీవనది. మనదేశ భాషల సాహిత్యాలు దీనికి ఉపనదులు. ఏ మాత్రము స్థూలదృష్టితో పరిశీలించినప్పటికిని భారతీయ సాహిత్యము యొక్క ఆత్మ ఒక్కటేనని స్పష్టము కాగలదు. భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత స్థాపితమైన కేంద్రసాహిత్య అకాడమికి ప్రారంభోత్సవం చేస్తూ, డాక్టర్ రాధాకృష్ణ పండితుడు "భిన్నలిపులలో వ్రాసినప్పటికిని భారతీయ సాహిత్యమంతా ఒక్కటే" అని ఉద్ఘాటించినారు. ఈ ఉద్ఘాటన సర్వవిధాల సమంజసమైనది. దేశభాషలలోని సాహిత్య వికాసాన్ని పరిణామాన్ని పరిశీలించినప్పుడు ఈ ఏకత్వాన్ని స్పష్టంగా గమనించవచ్చును. వైదిక, బౌద్ధ, జైన మతాల ప్రభావం, రామాయణ, మహాభారతాల ప్రభావం, సంస్కృత భాషా ప్రభావం, పారసీభాషాప్రభావం, ఇంగ్లీషు భాషా ప్రభావం, ఇటీవల ఫ్రెంచి, రష్యన్ మొదలైన విదేశ సాహిత్యాల ప్రభావం మన దేశభాషల సాహిత్యాలమీద స్పష్టంగా గోచరిస్తున్నవి. ప్రాంతీయ భాషలన్నిటిలోను ఒకేకాలంలో సాహిత్యం ద్వారా అనేక భక్తి ఉద్యమాలు ప్రచారంలోకి రావటం గమనించ వచ్చును. వీని మీద భిన్న కాలాలలో వచ్చిన వివిధ ఇతర ఉద్యమాల ప్రభావాన్ని కూడా మనం పోల్చుకోవచ్చును. పాలీ- ప్రాకృత భాషల భూమికను కూడా మనం గుర్తింప వచ్చును.

దేశభాషా సారస్వతాలు

భారతదేశంలో అనేక భాషలు (వీటిలో లిపిలేనిభాషలు కూడా) ఉన్నవి. లిపిలేని భాషలలో కూడా సాహిత్యం మనకు కనిపిస్తుంది. ఈ దేశభాషల సారస్వతాలను అవలోకించినప్పుడు వీని వికాసాలు రెండు విధాలుగా జరిగినట్లు వెల్లడి కాగలదు. మొదటిది - జానపద సారస్వతము, రెండవది - పండిత సారస్వతము. జానపద సారస్వతమే ప్రజా సారస్వతము. పండిత సారస్వతానికి రాజుల ఆదరణ పోషణ లభించినవి. తెలుగులో పండిత సారస్వతానికి రూపురేఖలు దిద్దిన మహాకవి నన్నయభట్టు. నన్నయభట్టు కాలంనాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను తెలుసుకొన్నప్పుడే తెలుగు సాహిత్యానికి ఆయన మార్గదర్శకత్వం మనకు విశదం కాగలదు.

తెలుగు - తెనుగు, ఆంధ్రం

అనేక శతాబ్దాల నుండి తెలుగు భాషను - తెలుగు, తెనుగు, ఆంధ్రము అని వ్యవహరించడం జరుగుతున్నది. తెలుగు భాషను మాట్లాడే ప్రజల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో సుమారు అయిదుకోట్లు; ఆంధ్రప్రదేశ్ వెలుపల ఒకకోటి; మొత్తం ఆరుకోట్ల వరకు కలరు. హిందీ భాష తర్వాత రెండవ స్థానం మన దేశంలో జనాభాదృష్ట్యా తెలుగుకు లభిస్తున్నది. భారతదేశజనాభాలో తెలుగు మాట్లాడే ప్రజల జనాభా పదవ వంతుకాగా, వారు ఎనిమిదవ వంతు భూభాగంలో నివసిస్తున్నారు. పరదేశాలన్నా, పరభాషలన్నా తెలుగు వాడు ఎన్నడూ ఉలికి పడలేదు. పొడుగైన సముద్రతీరం ఉన్నందు వలన అనేక శతాబ్దాల నుండి తెలుగువారికి విదేశాలతో వ్యాపారసంబంధాలతోపాటు సాంస్కృతిక సంబంధాలు కూడా కలిగినవి. తెలుగు లిపి సమగ్రమైనది, సుందరమైనది తెలుగుభాష తీయదనము దేశీయులను, విదే

శీయులను ఆకర్షించినది కర్ణాటక సంగీతంలో సాహిత్యరచన కొరకు తెలుగుకు అగ్రస్థానం లభించినది. ఆంగ్లేయవిద్వాంసు లొకరు - తెలుగు గ్రీకు భాషవలె పలుకుబడికల భాష అని అన్నారు. మరొకరు - ఇటాలియన్ భాషవలె తీయనైనదని అన్నారు. శక్తివంతంగా, సొగసుగా, సరళంగా అభిప్రాయాలను వ్యక్తీకరించడంలో దక్షిణదేశ భాషలలో తెలుగు శక్తివంతమైనదని పాశ్చాత్య విద్వాంసులు మరి కొందరు తెలిపినారు.

"Telugu can be looked upon as the Northern most member of the Southern languages or the Southern most member of the Northern languages; and it has the advantages of both groups with few, if any, of the defects. It is adaptable, absorptive, grammatically simple and euphonically exceptionally beautiful even when using foreign words. It has never suffered from narrow provincialism."

—G. HOMEFIELD MCLEOD

జె.బి.ఎస్. హాల్డేన్ అన్న మాటలు కూడా గమనించండి.

"You cannot keepout foreign words as you keepout foreign manufactured goods; perhaps Telugu accepts them more easily than any other Indian language."

—J. B. S. HALDANE

మన దేశభాషలలో తమిళాన్ని, కర్ణాటకాన్ని వదిలితే తెలుగు భాషాసాహిత్యాలు ఇతర ప్రాంతీయ భాషా సాహిత్యాలకన్నా ప్రాచీనమైనవి. తెలుగులో పండిత సాహిత్య రచనకు మార్గదర్శకుడైన మహా కవి నన్నయభట్టు. ఆయన సారస్వతమూర్తిని పరిచయం

చేయడానికి ముందు ఆనాడు దేశంలో నెలకొని ఉండిన రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను అవగాహన చేసుకోవలసి ఉంటుంది.

నన్నయభట్టు - దేశ కాల పరిస్థితులు

నన్నయభట్టు పదకొండవ శతాబ్దమున జీవించి, వేంగీ రాజధానిగా మనదేశాన్ని పాలించిన చాళుక్య వంశీయుడైన రాజనరేంద్రుని ఆస్థానంలో ఆదరణ పొందిన విద్యాదయితుడు, మహితాత్ముడు ఆంధ్రకవితా విశారదుడు. రాజనరేంద్రుని పట్టాభిషేకము క్రీ.శ. 1022లో జరిగినది. ఆయన నలభై సంవత్సరాలు పరిపాలించినాడు; అనగా క్రీ. శ. 1062 వరకు పరిపాలించినట్లు చరిత్ర తెల్పుతున్నది. రాజనరేంద్రుని కోరిక మీద తెలుగులో నన్నయ మహాభారత రచనను ప్రారంభించి - ఆది, సభా పర్వాలను అరణ్య పర్వంలో కొంత భాగాన్ని వ్రాసినాడు. అంతటితో మహాభారత రచన రెండు నూర్ల సంవత్సరాలు ఆగిపోయినది.

నన్నయ భారత రచన జరిగినప్పటి మనదేశ పరిస్థితులను మనం గమనించ వలసి ఉంది

భారతీయ నాగరికత మిక్కిలి ప్రాచీనమైనది. క్రీ.శ. అయిదు వేల సంవత్సరాలకు పూర్వమే వెలసిన హరప్పా, మొహంజోదారో అనే రెండు ప్రాచీన నగరాలను మన చరిత్ర పరిశోధకులు కనుగొన్నారు. ఈ నగరాలలోని కట్టడాలు సమస్త ప్రపంచానికి ఆశ్చర్యము కలిగించేవిగా, నాటి నాగరికతా స్వరూపాన్ని వివరించేవిగా ఉన్నవి. అయితే నాటి నుండి నేటి వరకు దేశచరిత్ర సమగ్రంగా ఒక కథవలె చెప్పడానికి వీలైన ఆధార సామగ్రి మనముందు లేదు. భారతదేశాన్ని అనేక రాజవంశాలు పరిపాలించినవి. పారసీకులూ,

గ్రీకులు విదేశాల నుండి వచ్చి భారతదేశ పరిపాలకులను జయించిన సంఘటనలు కూడా మనకు కనిపిస్తున్నవి. రాజకీయంగా ఈ దండయాత్రల ప్రభావం ఏమైనప్పటికిని, విదేశాలతో భారతదేశానికి అనేక శతాబ్దాల నుండి వ్యాపార సంబంధాలు ఏర్పడి సాంస్కృతికంగా పరస్పరం ప్రభావితమైనవి. భారతదేశాన్ని పరిపాలించిన రాజ్యాలలో మగధ, మౌర్య, గుప్త సామ్రాజ్యాలు మనకు తెలిసినంత వరకు ప్రాచీనమైనవి. మగధ రాజుల పరిపాలనలో జైన, బౌద్ధాలు వ్యాప్తి చెందినవి, కౌటిల్యుడు, కామందుకుడు, పతంజలివంటి శాస్త్రవేత్తలు జన్మించి విజ్ఞానాభివృద్ధికి తోడ్పడిరి. నలంద, విక్రమశిల వంటి విద్యాలయాలు నెలకొని కళలు, విజ్ఞానం ప్రగతి పొందుటకు కారణభూతమైనది. మగధరాజుల పరిపాలనా కాలంలోనే అలెగ్జాండర్ భారతదేశంపైన దండయాత్ర చేసినాడు. మగధరాజ్య పతనం తర్వాత మౌర్యచంద్రగుప్తుడు హిమాలయాల నుండి వింధ్య పర్వతాల వరకుగల దేశాన్ని తన ఏలుబడిలోనికి తీసుకొని వచ్చినాడు. ఆఫ్గనిస్తాన్ గుజరాత్‌లు కూడా మౌర్యచంద్రగుప్తుని ఏలుబడిలో ఉండెను. మౌర్యులు సమస్త భారతీయ దృక్పథంతో పరిపాలన నిర్వహించిరి. వీరి తర్వాత మరికొన్ని రాజవంశాలు మనదేశాన్ని పరిపాలించినవి. మౌర్య సామ్రాజ్యము పతనమైన తర్వాత వైదిక, జైన మతములు ముందడుగు వేసినవి. వైదికమతముతో పాటు సంస్కృతభాషకు ప్రాధాన్యం హెచ్చినది. పాణిని ప్రారంభించిన వ్యాకరణాన్ని పూర్తి చేసిన పతంజలి ఈ కాలంవాడే. అశ్వఘోషుడు మొదలైన విద్వాంసులు, గౌతమబుద్ధుని చరిత్రవంటి గ్రంథాలనుకూడా సంస్కృతభాషలోనే రచించిరి. మనుధర్మశాస్త్రం యీ కాలంలోనే వ్యాప్తికి వచ్చినది. తరువాత క్రీ.శ. నాల్గవ శతాబ్దంలో గుప్తసామ్రాజ్యం అవతరించినది. గుప్తసామ్రాజ్యం హిమాలయంనుండి నర్మదానది వరకు భాగీరథినుండి చెంబల్ నదివరకు వ్యాపించినది.

గుప్తసామ్రాజ్యము కూడా ఇంచుమించుగా సమస్త భారతీయ దృక్పథం కలిగిన సామ్రాజ్యము. గుప్తసామ్రాజ్య పాలనలో కూడా విదేశాలతో భారతదేశానికి వ్యాపార సాంస్కృతిక సంబంధాలు యేర్పడినవి. చీనా నుండి ఫాహియాన్ ఈ కాలములోనే బౌద్ధమత తత్వాన్ని అవగాహన చేసుకోడానికి భారతదేశానికి వచ్చినాడు. ఆ తరవాత హర్షసామ్రాజ్యం మన దేశాన్ని పరిపాలించినది. హర్షుడు పాలించిన రాజ్యానికి నర్మదానది దక్షిణ సరిహద్దుగా ఉండినది. హర్షుని కాలమున హ్యూయన్త్సాంగ్ చైనా నుండి భారతదేశానికి వచ్చి పదిహేనేండ్లు భారతదేశంలో నివసించి బౌద్ధ విహారాలను, నలంద మొదలైన విశ్వవిద్యాలయాలను సందర్శించి నాటి భారతీయ సమాజాన్ని గూర్చి అనేక విషయాలు వ్రాసిపెట్టినాడు. బౌద్ధాన్ని దేశవిదేశాలలో వ్యాప్తిగావించిన అశోకునివలె, హర్షుడు కూడా బౌద్ధుడే. అయితే ఆయన వైదిక, బౌద్ధమతాలను సమానంగా ఆదరించినాడు. హర్షుడు స్వయంగా కవి. బాణభట్టు మొదలైన సంస్కృత మహాకవులను ఆయన ఆదరించినాడు. గుప్తచక్రవర్తులవలెనే శ్రీహర్షుడు సంస్కృతభాషను ప్రోత్సహించినాడు. కాళిదాసు, అమరసింహుడు ధన్వంతరి, వరాహమిహిరుడు, ఆర్యభట్టు మొదలైనకవులు విద్వాంసులు గుప్తచక్రవర్తుల కాలంలోను రాజాదరణ పొందినారు. కుమారిలభట్టు ఈకాలంవాడే. కుమారిలభట్టు అవసానదశలో శంకరాచార్యుడు వేదాంతగ్రంథంలను వ్రాసి సకలభారతంలో వైదికమత వ్యాప్తికి కృషి చేసినాడు. ప్రారంభదశలో వైదికమతము, తరువాత దానిపైన తిరుగుబాటు చేసిన బౌద్ధ, జైనాల ప్రాబల్యం, ఆపిమ్మట వాని క్షీణదశ, అనంతరం వైదికమత పునరుజ్జీవనం, తత్ఫలితంగా యజ్ఞయాగాదులు! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనే నాలుగు

తెగలుగా రూపొందిన వర్ణాశ్రమ వ్యవస్థ భారతదేశంలో వెలసినది. హర్షుని తర్వాత స్వతంత్ర రాజ్యాలు దేశంలో అవతరించినవి. గుజరాతు, నేపాల్. కన్యాకుబ్జములు స్వతంత్ర రాజ్యాలుగా స్థిరపడినవి. కాబూల్, పంజాబు, సింధుదేశాలు విదేశీయుల వశమైనవి. బీహార్. బంగాళ ప్రాంతాలను స్వతంత్రంగా పాలించిన రాజవంశాలు అవతరించినవి. క్రమక్రమంగా దేశంలో వివిధప్రాంతాలలో వివిధ రాజవంశాల పరిపాలన ప్రారంభమైనది. తత్ఫలితంగా పదకొండవ శతాబ్దంలో దేశాన్ని పరిపాలించిన అఖిల భారత సామ్రాజ్యం ఏదీ లేకపోయినది. క్రీ.శ. 7-12 శతాబ్దాల మధ్య దేశాన్ని పరిపాలించిన వివిధ సామ్రాజ్యాలు విచ్ఛిన్నమై చిన్నచిన్న రాజ్యాలుగా రూపొందినవి. దక్షిణభారతాన్నికూడా తన ఏలుబడిలోనికి తీసుకు రావలెనని అభిలషించిన హర్ష చక్రవర్తి పశ్చిమ చాళుక్యరాజైన పులకేశుని చేతిలో ఓడిపోయినాడు. భారతదేశంలో ఎక్కువభాగాన్ని పరిపాలించిన రాజులలో హర్షుడే చివరివాడు. హర్షుని తర్వాత ఆయన సామ్రాజ్యం చిన్నచిన్న రాజ్యాలుగా విడిపోయినది. జైన బౌద్ధమతాలు సకలదేశాన్ని ఆవరించినవి. విశేషించి బౌద్ధమతం పరదేశాలకుకూడా విస్తరించి, క్రమక్రమంగా పదకొండవ శతాబ్ది వరకు తన ప్రాధాన్యాన్ని అనేక కారణాలవల్ల కోల్పోయినది. మొదటిలో-జైన, బౌద్ధాల తాకిడికి తట్టుకోలేక క్షీణించిన వైదిక మతం తిరిగి ప్రాధ్యానంపొంది శంకర, రామానుజ, మధ్వాఆచార్యుల కృషిచేత యావత్ భారతస్థాయిలో పునరుజ్జీవనం పొందినది.శంకరాచార్యుడు నన్నయకు పూర్వుడు. క్రీ.శ. ఏడవ శతాబ్ది రెండవ సగములో జీవించిన శంకరాచార్యుడు బౌద్ధమతానికి వ్యతిరేకంగా అద్వైతాన్ని ప్రతిపాదించి యావద్భారతంలో ప్రచారం చేసినాడు. రామానుజాచార్యుడు 1017లో తమిళప్రాంతంలో జన్మించి నూటా

నూరపై సంవత్సరాలు జీవించి భక్తిప్రధానమైన వైష్ణవమతాన్ని ప్రతిపాదించి ప్రచారంచేసినాడు. వైష్ణవంకూడా వైదికధర్మానికి అనుగుణమై అఖిల భారతస్థాయిలో వ్యాప్తిచెందినది. రామానుజుడు నన్నయకు, కొంచెము పూర్వుడో లేక సమకాలికుడో కావచ్చును. రామానుజునికి కొన్ని శతాబ్దాలకు పూర్వము ఆళ్వారులు అవతరించి తమిళ ప్రాంతంలో క్రీ.శ. 300 నుండి 800 మధ్యకాలంలో కీర్తనలు రచించి, భక్తిని ప్రబోధించినారు. రామానుజునిపైన యీ ఆళ్వారుల రచనల ప్రభావం కొంతపడియుండవచ్చును. రాజకీయమైన ఒడిదుడుకులు ఏ విధంగా ఉన్నప్పటికిని రాజ్యాలు, సామ్రాజ్యాలు అంతరించినప్పటికిని సకల భారతస్థాయిలో సాంస్కృతిక సమైక్యత విచ్ఛిన్నంకాలేదు. ఐరోపా ఖండంలోని పరిస్థితి భారతదేశంలో రాలేదు అని మనం గమనించవలసి ఉంటుంది. భారతీయ సాహిత్యం, భారతీయ కళలు, భిన్నమత ఉద్యమాలు, ఆ ఉద్యమాలకు అనుగుణంగా రచితమైన సారస్వతముపైన పేర్కొన్న సమైక్యతను రుజువు చేస్తున్నవి.

దక్షిణ భారతంలో రాజ్యాలు

హిమాలయంనుండి వింధ్య పర్వతాలవరకు మౌర్య, గుప్త సామ్రాజ్యాలు పరిపాలిస్తుండగా నామమాత్రమైన సార్వభౌమాధికారం మెట్లున్నప్పటికిని, వింధ్యకు దక్షిణంలో ఉన్న ప్రాంతాలను అనేక రాజవంశాలు పరిపాలించినవి. ఈ వింధ్య పర్వతానికి దక్షిణముగా ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, ద్రవిడ, కేరళ ప్రాంతాలు ఉన్నవి. అనేక రాజవంశాలు ప్రాచీనకాలంనుండి ఈ ప్రాంతాలను పరిపాలించినవి. వీరిలో ఆంధ్రజాతి చాలా ప్రాచీనమైనది. మౌర్యచంద్రగుప్తుని ఆస్థానంలో ఉండిన గ్రీకు రాయబారి "మెగస్తనీస్" ఆంధ్రులనుగూర్చి ప్రస్తావించినాడు. ఆంధ్రదేశాన్ని స్వతంత్రంగా పరిపాలించిన రాజవంశాలలో మొట్టమొదటిది శాతవాహన రాజవంశం.

వారికి శాలివాహనులనికూడా పేరు. రెండువేల సంవత్సరాలకు పూర్వం మొత్తం తెలుగుదేశం, అనగా తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు వారి ఏలుబడిలో ఉండినవి. వారు పాలించిన ప్రాంతమే ఆంధ్రరాజ్యం. ముప్ఫై మంది శాతవాహనరాజులు సుమారు నాలుగునూర్ల యాభై సంవత్సరాలు ఆంధ్ర దేశాన్ని పరిపాలించిరి. వారి పరిపాలన క్రీ.శ. మొదటి అర్ధ భాగంలో ముగిసింది. శాతవాహనులు ప్రాకృతభాషలో కవిత్వాన్ని ప్రోత్సహించినారు. రాజభాష ప్రాకృతభాష. అందుచేత శాసనాలన్ని ప్రాకృతభాషలోనే వ్రాసినారు. హాలశాతవాహనుడు సంకలనం చేసిన "గాథాసప్తశతి" ప్రాకృతభాషలో రచితమై, శృంగారగాథలకు ఆలవాలమై నాటి సామాజిక జీవనాన్ని ప్రతిబింబిస్తున్న సుప్రసిద్ధ కావ్యము. ఆనాటి సాహిత్యంలో తెలుగుపదాలు దొరికినవి. గాథ అంటే ప్రాకృత ఛందస్సు. శాతవాహనులు వేదమతాన్ని అనుసరించినారు. అయితేవారు బౌద్ధాన్నికూడా ప్రోత్సహించినారు. శాతవాహనులకాలంలో కళలు, విద్య అభివృద్ధి చెందినవి. క్రీ.శ. మూడవ శతాబ్ది అర్ధభాగంలో శాతవాహనరాజ్యం అంతమొందినది. తరువాత ఇక్ష్వాకులు తెలుగుదేశాన్ని పరిపాలించినారు. ఇక్ష్వాకుల కాలంలోకూడా అధికారభాష ప్రాకృతమే. ప్రాకృత వాఙ్మయాన్ని రాజులు ఆదరించగా విద్వాంసులు వికసింపజేసినారు. దానపత్రాలు వ్రాసినా, మరేపత్రం వ్రాసినా అందుకు ప్రాకృతభాషనే ఉపయోగించిరి. స్త్రీలుకూడా ప్రాకృతంలో విదుషీమణులై కవిత్వాన్ని వ్రాసినారు. యాభైరెండు సంవత్సరాలు దేశాన్ని పరిపాలించిన ఇక్ష్వాకు రాజుల పరిపాలన క్రీ.శ. నాల్గవ శతాబ్దంలో సమాప్తమైనది. శాతవాహనుల కాలంలోనే విదేశాలనుండి శకులు వచ్చినారు. వీరు శైవ, వైష్ణవ, బౌద్ధ మతాలను అవలంబించి ఈప్రాంతాంలోనే స్థిరపడి యీ ప్రాంతీయులతోనే వివాహసంబంధాలు చేసుకున్నారు.

వర్తకవ్యాపారాలు అభివృద్ధి చెందడానికి శకులు తోడ్పడినారు. శకులు ఉజ్జయినీ పట్టణాన్ని రాజధానిగా చేసుకొని దేశాన్ని పరిపాలించి సంస్కృత విద్వాంసులను ఆదరించినారు. ఈవిధంగా వారు దేశంలో పలుకుబడి సంపాదించుకొని తమరాజ్యాన్ని సుస్థిరం చేసుకున్నారు. సంస్కృత విద్యలకు ఆలవాలమైన ఉజ్జయినీ నగరంలో శకరాజుల ప్రోత్సాహంలో జ్యోతిష్యం మొదలైన శాస్త్రాలు బాగా అభివృద్ధి పొందినవి. ఈనాడు మనం ఉపయోగించే పంచాంగం శకరాజుల కాలంలోనే గణితమై క్రమక్రమంగా వ్యాప్తిచెందినది. ఇక్ష్వాకు మహారాజులు యజ్ఞయాగాదులు చేసినారు. వేదమతాన్ని అవలంబించినారు. కాని స్త్రీలుమాత్రం బౌద్ధమతాన్ని అనుసరించినారు. ఈవిధంగా స్త్రీ, పురుషులు భిన్నమతాలను అవలంబించినప్పటికిని వారి సాంసారిక జీవనంలో కల్లోలం కలుగలేదు. ఇక్ష్వాకుల తర్వాత విష్ణుకుండినులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు దేశాన్ని పరిపాలించినారు. వీరి పరిపాలనలో యజ్ఞయాగాదులకు ప్రాధాన్యం హెచ్చినది. వీనిని నిర్వహించే బ్రాహ్మణులకు పలుకుబడికూడా పెరిగినది. ఇతరప్రాంతాలనుండి వేదవేదాంగాలు చదివిన బ్రాహ్మణులు అనేకులు తెలుగుదేశంలో స్థిరపడినారు. ఈ రాజులందరూ వేద మతానుయాయులే. కొందరు శైవులైతే మరికొందరు వైష్ణవులు. బౌద్ధమతం క్రమంగా క్షీణించినది. ప్రస్తుత శ్రీశైలం ఆనాడే శైవక్షేత్రంగా కీర్తిగాంచినది. ప్రాకృతకవులకు ప్రాకృత గ్రంధాలకు క్రమక్రమంగా అభిమానం తగ్గినది. సంస్కృతభాషకు, సంస్కృతకవులకు, వేదవిద్యలకు ప్రాధాన్యం హెచ్చినది. తెలుగుభాషరేఖ ఈకాలంలోనే క్రమంగా బలపడినదని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు గ్రంథస్థం గావించిరి. విష్ణుకుండినులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు పరిపాలించి

సవి శాతవాహనుల రాజ్యాలవలె పెద్దరాజ్యాలుకావు. శాతవాహనుల కాలంనుంచి వేంగి చాళుక్యులవరకు, అనగా సుమారు తొమ్మదినూర్ల సంవత్సరాలకాలం ఈవిధంగా గడిచినది.

తెలుగుదేశం - చాళుక్యులు

తొమ్మిది, పది, పదకొండు శతాబ్దాల మధ్య రెండునూర్ల సంవత్సరాలకుపైగా పరిపాలించిన రాజవంశాలు పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు. చాళుక్యుల యేలుబడిలో యించుమించుగా పూర్వాంధ్ర దేశమంతా వచ్చినదని చెప్పవచ్చును. వారిప్రక్కనే పల్లవరాజులు పశ్చిమాంధ్రదేశంలో కొంతభాగం ఆశ్రయించుకొని పరిపాలించినారు; బాదామి నగరాన్ని సత్యాశ్రయ మహారాజ సంతతివారు ఎనిమిదవ శతాబ్ది మధ్యవరకు పరిపాలించిరి, మాల్ఖేడ్ (మాల్యంఖేటం) రాజధానిగా రాజ్యంచేసిన రాష్ట్రకూట వంశపురాజులు వీరిని జయించి రెండునూర్ల సంవత్సరాలకాలం, అనగా పదవ శతాబ్ది మధ్యవరకు యీప్రాంతాన్ని పరిపాలించినారు. ఈవిధంగా వేంగిచాళుక్యులు, బాదామీచాళుక్యులు, రాష్ట్రకూటరాజులు వింధ్యకు దక్షిణంగా ఉన్నప్రాంతాలను పరిపాలించినారు. రాష్ట్ర కూటరాజులకు, వేంగిచాళుక్య రాజులకు మధ్య అప్పుడప్పుడు రాజ్య విస్తరణకాంక్షతో యుద్ధాలుకూడా జరుగుతుండేవి. వేంగిచాళుక్య రాజులలో కొందరు పరాక్రమవంతులై శత్రువులను యుద్ధాలలో ఓడించినారు. ఇటువంటి వారిలో విజయాదిత్యుడు ప్రత్యేకంగా పేర్కొనదగినవాడు. విజయదిత్యుని కొడుకు అమ్మరాజ రాజ మహేంద్రుడు. తనపేరుతో నేటి రాజమహేంద్రవరాన్ని నిర్మించి నాడు. చాళుక్యరాజులకు చోళులతోకూడా రాజ్యవిస్తరణ కాంక్షతో యుద్ధాలు జరుగుతుండేవి. తరువాత యీ ఉభయవంశాల మధ్య

బాంధవ్యము ఏర్పడి పరస్పర సహాయం చేసుకొన్నారు. చోళ మహారాజులు తమ ఆడుబిడ్డలను చాళుక్య మహారాజుల కిచ్చి పెండ్లిండ్లు చేసినారు. రాజరాజు చోళమహారాజు తన సోదరి కుందవాంబను చాళుక్యరాజైన విమలాదిత్యున కిచ్చి పెండ్లి చేసినాడు. ఆ దంపతుల కుమారుడైన రాజనరేంద్రుడు తిరిగి రాజేంద్రచోళుని కూతురు అమ్మంగదేవిని మేనరికంగా వివాహం చేసుకొన్నాడు. తత్ఫలితంగా ఈ ఉభయవంశాలు సన్నిహితమై దేశంలో కొంత శాంతి ఏర్పడినది. క్రీ.శ. 1022లో రాజనరేంద్రుని పట్టాభిషేకము జరిగినది. ఆయన నలభై సంవత్సరాలు, అనగా 1062 వరకు పరిపాలించినాడు. నన్నయభట్టు రాజనరేంద్రుని ఆస్థానకవి.

పదకొండవ శతాబ్దంలో చినచిన్న రాజ్యాలు అన్నీ అంతరించి చోళ, చాళుక్య, కళింగ రాజ్యాలలో అంతర్లీనమైనవి. ఆపిమ్మట కొంతకాలం దేశంలో శాంతి నెలకొన్నదువలన భాషాభివృద్ధికి, సాహిత్యప్రగతికి అవసరమైన పరిస్థితులు ఏర్పడినవి. మత ద్వేషాలు కూడా చాలావఱ్టుకు తొలగిపోయినవి. రాజులు ప్రజల అభ్యుదయాన్ని గురించి ఆలోచించడానికి కావలసిన వాతావరణం ఏర్పడినది. పండితులు, విద్వాంసులు రచనావ్యాసంగాన్ని చేపట్టిరి. తెలుగుదేశానికి పొరుగుననే ఉన్న కన్నడదేశంలో కర్ణాటకవాఙ్మయం పెంపొందినది. పంప, పొన్న, రన్న అను ముగ్గురు కవులు జైన మతానుసారముగా రచనలు గావించిరి. పంపడు భారతం, విక్రమార్క విజయం అనేపేరుతో రచించగా అది జనాదరణ పొందినది. విక్రమార్క విజయంలో అర్జునుడే కథానాయకుడు. తన రాజును దృష్టిలో ఉంచుకొని పంపడు అర్జునుని కథానాయకునిగా చేసినాడు.

రాజనరేంద్రునికి వైదికమతముపైన అభిమానం. ఆయనకు తమ సమకాలిక దేశపరిస్థితులు, ముఖ్యంగా కన్నడ దేశ పరిస్థితులు బాగా తెలిసి ఉండవచ్చును. బహుశ ఆ పరిస్థితులను గమనించియే కాబోలు అందుకు పూర్తిగా వ్యతిరేకమైన ఉద్దేశంతో వైదిక మతానుసారంగా వ్యాసరచిత మహాభారతాన్ని తెనిగించ వలసినదని రాజనరేంద్రుడు నన్నయభట్టును అభ్యర్థించినాడు. నన్నయభట్టు కొంతభాగం వ్రాసిన తర్వాత, అనగా రాజరాజు మరణానంతరం భారతరచన ఆగిపోయినది. తర్వాత కొంతకాలంవరకు కొనసాగ లేదు. అందుకు కారణం అప్పటి రాజకీయ, మత పరిస్థితులేనని చెప్పవచ్చును. రాజరాజు కుమారుడు కులోత్తుంగ చోళదేవుడు. తన మాతామహుల రాజ్యమైన చోళరాజ్యానికి పరిపాలకుడైనాడు. చోళరాజ్యంలో తమిళభాషకే ప్రాబల్యం. కావున ఆంధ్రభాషా వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం లేకుండెను. క్రీ.శ. పన్నెండవ శతాబ్దం ఆరంభంలో కన్నడదేశమున బసవేశ్వరుడు ఉద్భవించి వీరశైవాన్ని స్థాపించెను. వీరశైవం భక్తిప్రధానమైన మతం. వర్ణాశ్రమ వ్యవస్థకు వేదప్రామాణ్యానికి పూర్తిగా వ్యతిరేకమైనది. రామానుజుడు స్థాపించిన వైష్ణవం ఆంధ్రదేశంలో వ్యాప్తిచెందడం జరిగినది. వైష్ణవంకూడా భక్తి ప్రధానమైనది. కావున భారత రచన కొనసాగడానికి కొంతకాలం ఆటంకం కలిగినది. నన్నయ ఆది, సభాపర్వాలు పూర్తిగాను, అరణ్యంలో మూడు ఆశ్వాసాలపైన 142 పద్యాలు రచించి ఆగినాడు.

నన్నయభట్టు సారస్వతమూర్తిని సమగ్రంగా సందర్శించ డానికి ఆకాలంలో యితర భాషాసాహిత్యాలు ఏవిధంగా ప్రగతి

చెందినవో స్థూలంగా నైనప్పటికీని తెలుసుకోవడం అవసరం. అప్పటివరకు భారతదేశంలో ప్రాకృతభాషలో రమ్యమైన సారస్వతం పుష్కలంగా ఉండెను. సంస్కృత సారస్వతముకన్న గుణములో ప్రాకృత సారస్వతము గొప్పదని కూడా ఒక అభిప్రాయ మున్నది. ప్రాకృతము, మహారాష్ట్రి, శౌరసేని, పైశాచి, మాగధి అని అయిదు పేర్లతో ప్రాకృతము వ్యాప్తిచెందినది. ఈ భాషలన్నింటిపైన సంస్కృత ప్రభావంకూడా స్పష్టంగా కనిపిస్తున్నది. జైన, బౌద్ధ సంప్రదాయాలకు చెందిన వాఙ్మయం వీనిలోవిశేషంగా కనిపిస్తున్నది. పాళిభాషకూడా మనదేశంలో అభివృద్ధి చెంది బౌద్ధధర్మాన్ని ప్రతిపాదించే వాఙ్మయానికి ఆటపట్టైనది. ఇది ఇట్లుండగా దేశభాషలలో సారస్వతము ఏవిధంగా ముందుకుపోయినదో మనం తెలుసుకోవలసి ఉంటుంది.

భారతీయ భాషలు - ప్రారంభ వికాసాలు

క్రీ.శ. ఏడవ శతాబ్దంనాటికే అస్సామీ భాషలో సాహిత్యం ఉండినట్లు తెలుస్తున్నది. జానపద సాహిత్యమేకాక పండిత సాహిత్యంకూడా రచితమైనట్లు నిదర్శనాలు ఉన్నవి. పదమూడవ శతాబ్దంనుండి ప్రాచీన అస్సామీ సాహిత్యం బాగా వర్ధిల్లినది. పదహారవ శతాబ్దంలో భక్తకవులు అస్సామీలో రచనలు కావించినారు. ఆపిమ్మట భారతభాగవత పురాణాలు అస్సామి భాషలోనికి వచ్చినవి. తర్వాత అస్సామిభాషకు రాజపోషణకూడా లభించినది. ఒరియా భాషలో పదిహేనవ శతాబ్దంనుండియే సాహిత్యం ముందడుగు వేసినది; భారత, రామాయణ, భాగవతాలు రచితమైనవి. కాశ్మీరి భాషలోకూడా ప్రాచీన వాఙ్మయం పద్నాల్గవ శతాబ్దంనుండియే ఆరంభమైనట్లు చరిత్ర తెలుపుతున్నది. గుజరాత్ భాషలో ప్రాచీన

వాఙ్మయం క్రీ.శ. 1150 నుండి క్రీ.శ. 1450 వరకు క్రమవికాసం పొందినది. గుజరాతి భాషలో ఆదిమకావ్యాలను జైనసన్యాసులు రచించినారు. జైనేతరుల రచనలు పదిహేనవ శతాబ్దం తరువాతనే ప్రాధాన్యం వహించినవి. పంజాబీ భాషలోకూడా సాహిత్యం పదిహేనవ శతాబ్దంలోనే వికసించడం ప్రారంభమైనదని భారతీయ సాహిత్య చరిత్ర చెప్పుతున్నది. వంగభాషకు సుమారు వేయి సంవత్సరాల చరిత్ర ఉన్నది. బెంగాలీభాషలో ప్రాచీనవాఙ్మయం భక్తి సాహిత్యంగా ప్రారంభమైనది. పదిహేనవ శతాబ్దంలో రామాయణ రచన జరిగినది. తర్వాత భారత, భాగవత రచనలు కూడా జరిగినవి మరాఠీ భాష ఏడవ శతాబ్దంనుండి ప్రచారంలో ఉన్నప్పటికివి పన్నెండవ శతాబ్దంలోనే అందులో సారస్వత రచన జరిగినది. 1189లో రచితమైన "వివేక సింధు" మరాఠి సాహిత్యంలో మొదటిగ్రంథం, పన్నెండు, పదమూడవ శతాబ్దాలలో మహారాష్ట్రములో ధార్మిక విప్లవాలు చెలరేగి వైదిక మతముపైన వర్ణాశ్రమ వ్యవస్థపైన తిరుగుబాటు జరిగి కొత్త ఉద్యమాలు బయలు దేరినవి వైదిక సమ్మతములైన రచనలను పదమూడవ శతాబ్దంలో జ్ఞానేశ్వరుడు చేసినాడు పద్నాల్గవ శతాబ్దంనుండి పదహారవ శతాబ్దంవరకు పేర్కొనదగిన రచనలేవీ మహారాష్ట్రంలో జరుగలేదు. భాగవతం, భగవద్గీత మొదలైన గ్రంథాలు పదహారవ శతాబ్దం నుండియే మహారాష్ట్రంలో వచ్చినవి హిందీ సాహిత్యం పదకొండవ శతాబ్దంనుండి పద్నాల్గవ శతాబ్దం మధ్యే ప్రారంభమై అభివృద్ధిచెందినది భక్తిసాహిత్యం హిందీలో గుణములోను, పరిమాణములోను పుష్కలంగా వచ్చినది. ఈవిధంగా భారత దేశ భాషలలో రామాయణ, భారత భాగవతాలు తెలుగుభారతం తర్వాతనే రచితమైనట్లు స్పష్టమౌతున్నది.

అయితే తెలుగుభారతానికి ముందే కన్నడంలోను, తమిళం లోను భారత రచన జరిగినది. ఈరెండు తెలుగుకన్న ప్రాచీనభాష లని అంగీకరించవలసి ఉంటుంది. కన్నడంలో భారతం రచించిన పంపడు పదవ శతాబ్దానికి చెందినవాడు. ఆయన తన భారతానికి అర్జునుని నాయకునిగావించి తనరాజుకు అర్జునునికి అభేద భావం కల్పించినాడు. పంపని భారతం వ్యాసభారతానికి అనువాదము కాదు; స్వతంత్రమైన అనుసరణ. తమిళంలో సాహిత్యం ఏడవ శతాబ్దముననే ప్రారంభమైనది తమిళంలోని తొలి కావ్యమైన "తొల్కాప్పియము" ఉత్తమశ్రేణికి చెందిన రచన. ఆనాటి తమిళ ప్రాంత ప్రజల మతాన్ని, విశ్వాసాన్ని, అక్కడి పరిపాలనా సంస్థలను, వివాహ విధానాలను మొదలైనవానిని ఈకావ్యంలో చిత్రించడం జరిగి తమిళ సాంఘిక జీవనానికి యీకావ్యం దర్పణముగా ఉన్నది. అనంతరము వచ్చిన "సిలప్పదికారము" "మణిమేఖలై" మొదలైన గ్రాంథాలుకూడా సాంఘిక జీవనానికి ప్రతిబింబాలే. ఆ పిమ్మట వచ్చిన భక్తివాఙ్మయం కూడా రామాయణ, మహాభారతాల ఇతివృత్తాన్ని స్వీకరించినవికావు. తొమ్మిదవ శతాబ్దంలో ప్రారంభమైన చోళయుగంలో "కంబరామాయణ" రచన జరిగినది మళయాళంలో పన్నెండు, పదమూడు శతాబ్దాలలో సాహిత్యరచన జరిగినది క్రీ శ 1195నుండి 1208 వరకు జీవించిన కవి కేరళ పాలకుడు రామవర్మమహారాజు "రామచరితము"ను రచించినాడు. ఇది మలయాళంలో చాలా ప్రసిద్ధమైన రచన ఈవిధంగా మనదేశభాష సారస్వతాలపైన ఒకదృష్టిని ప్రసరించినప్పుడు తమిళ, కన్నడ భారతాలను వదిలితే తెలుగు భారతమే భారతదేశ భాషల సాహిత్యంలో మొదటిదని చెప్పవలెను. సంస్కృతభాషలో వైదిక వాఙ్మయంతోపాటు లౌకిక వాఙ్మయంకూడా అపారంగా ఉన్నది. కొన్నిశతాబ్దాలకు పూర్వమే

సంస్కృతభాష ఆరంభవికాసాలు జరిగినవి. ప్రాకృతము, పాలి, పైశాచి భాషలుకూడా భారతదేశంలోని ప్రాచీన భాషలు. ఈమూడు భాషల ప్రభావం భారతీయ సాహిత్యముమీద, భారతీయ సంస్కృతి మీద స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ భాషలోని రచనలు భారతీయ సాహిత్యాన్ని ప్రభావితం చేసినది. దేశభాషలలో సాహిత్యం క్రీ.శ. నాలుగు అయిదు శతాబ్దాలనుండే ప్రారంభమై అభివృద్ధి చెంది నట్లు మనకు స్పష్టమౌతున్నది. తెలుగు సంస్కృతజన్యమా లేక ద్రావిడభాషల కుటుంబానికి చెందినదా అన్న వాదమొకటి కొంత కాలం జరిగినది; భిన్నాభిప్రాయాలు ప్రకటితమైనవి. తుట్టతుదకు ద్రావిడ భాషల కుటుంబానికి చెందినదన్న వాదము బలపడి స్థిరపడినది.

తెలుగుభాష-పరిణామం

తెలుగుభాష క్రీ.శ. ఒకటవ శతాబ్దమునుండియే ప్రచారంలో ఉండినట్లు ఉదాహరణలు ఉన్నవి క్రీ.శ. మొదటి అయిదు, ఆరు శతాబ్దాలలో తెలుగుభాష ఒక పరిణామాన్ని పొందినది. ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదిశతాబ్దాలలో ఆంధ్రభాషావికాసానికి ఒక స్పష్టమైన స్వరూపం ఏర్పడినది. పదకొండవ శతాబ్దంలో నన్నయభట్టు భారతరచన చేయడానికి పూర్వమే తెలుగులో తగినంత సాహిత్యము ఉన్నట్లు పరిశోధకులందరూ అంగీకరించి నారు. అరవ శతాబ్దంలో తెలుగు వ్యవహారంలో ఉండెనని చెప్పడానికి అవకాశం ఉన్నది. అంతేకాదు హాలుని ''గాథాసప్త శతి''లోకూడా తెలుగుపదాలు కనిపిస్తున్నవి. పాల్కురికి సోమ నాథుడు వ్రాసిన పండితారాధ్య చరిత్రలో తెలుగులో తుమ్మెదపదాలు, వెన్నెలపదాలు, ప్రభాతపదాలు మొదలైనవి ప్రజలు పాడుతుండినట్లు

తెల్పినాడు. అందుచేత నన్నయకు పూర్వమే తెలుగులో కవిత్వం ఉండెనని నిస్సందేహంగా చెప్పవచ్చును. ఆ కవిత్వాన్ని జన సముదాయం ఆదరించినది.

తూర్పు చాళుక్యులు-తెలుగుకు ప్రోత్సాహం

తెలుగు భాషా, సాహిత్యాలు తూర్పు చాళుక్యుల కాలమున బాగుగా వికసించినవి. క్రీ.శ. 615లో కుబ్జ విష్ణువర్ధనునితో ప్రారంభమై 11వ శతాబ్దంలో రాజరాజనరేంద్రుని వరకు తూర్పు చాళుక్యులు పూర్వాంధ్రమును అవిచ్ఛిన్నముగా పరిపాలించినారు. క్రీ.శ. 848 నుండి క్రీ.శ. 892 వరకు ఆంధ్రదేశమును పరిపాలించిన తూర్పు చాళుక్యరాజు గుణగ విజయాదిత్యుని కాలమున మనకు మొదటిసారిగా శాసనాలలో తెలుగుపద్యము లభించినది. తరువాత నన్నయకాలము వరకు శాసనాలలో తరువోజ, సీసము, ఆటవెలది, తేటగీతి, మధ్యాక్కర, కందము మొదలైన దేశీయ ఛందాలు లభించినవి. ఇవి ఆ రోజులలో ప్రజలలో ప్రచారములో నుండిన ఛందములు కావచ్చును. క్రమక్రమంగా అవి లిఖిత సాహిత్యములో ప్రవేశించి పండితాదరమును పొందినవి. అందుచేత నన్నయ నాటికే సంస్కృత వృత్తాలలో తెలుగు కవిత్వము వ్రాయడం ప్రారంభమైనదని చెప్పవచ్చును. మొదట శాసనాలలో దేశ్య పదములతో నిండి దెశీయముగా నుండెడిది. క్రమక్రమంగా తత్సమ పదాలు అనేకము పండితభాషలో చేరినవి. గద్య, పద్యము లను కలిపి రచన చేయు పద్ధతికూడా ఈకాలముననే రూపొందినది. దీనివిబట్టి నన్నయ భారత రచనా కాలమునాటికే అందులో కనిపించే రచనారీతులు పరిణామము పొంది ఉన్నవని చెప్పవచ్చును. సంస్కృత పదములతో నిండిన భాష, గద్యపద్య మయమైన చంపూ

పద్ధతి, సంస్కృత అలంకార శాస్త్రము ననుసరించిన రచనావిధానము సంస్కృత దేశీయ ఛందో విధానాల మిశ్రణం- వీటితోపాటు, వైదిక మార్గవర్తన కనుకూలమైన పురాణ రచనారీతి నన్నయ కాలము నాటికే రూపుదిద్దుకొన్నవి. తెలుగులో ఇటువంటి శిష్టకవిత ప్రారంభము కాకపూర్వము దేశీయ భాషలో, పద్ధతులలో రచన జరిగి ఉండవచ్చును. నన్నయ కాలమునాటికి సంస్కృత, ప్రాకృత భాషా సంబంధముతో శిష్టభాషా స్వరూపము మారిపోయినట్లే, సంస్కృత సాహితీ రీతులలో శిష్టసాహిత్య స్వరూపమొకటి రూపొందినది. ఇది దేశీయ మార్గమునకు భిన్నమైనది. ఈ మార్గములో మొదట సమగ్ర రచన చేసినవాడు నన్నయ. ఆదే ఆంధ్ర మహాభారతము అనఘమై, శిష్టాగ్రహార భూయిష్ఠమై, ధరణీసురోత్తమాధ్వర పుణ్య సమృద్ధమైన వేంగిదేశమును రాజమహేంద్ర వరము రాజధానిగా పరమధర్మ విదుడై, మనుమార్గవర్తనుడై, వైదిక నిష్ఠమైన మార్గమును నిలబెట్టడానికి పూనుకున్న రాజరాజ నరేంద్రునకు భారత శ్రవణాసక్తి ప్రీతియై ఉండడం సహజము. అమల సువర్ణ శృంగఖరమై కపిలంబగుగోశతాన్ని బహువేద విప్రులకు దానము చేసిన ఫలము భారత శ్రవణమువలన సమకూరును. సంస్కృత భారతమును చదివి, దేశీయ భాషలో అర్థము వివరించి వినిపించు పద్ధతి ఆరోజులలో ఉండినదనుటకు అవకాశము కలదు. పల్లవుల కాలములోను, ఆ తరువాతను దక్షిణ దేశపు దేవాలయాలలో భారత పఠనము చేయు ఉద్యోగిని ఒకనిని నియమించే ఆచారము కలదని తెలియుచున్నది. అట్టిదానిని పూర్తిగా తెలుగులోనికి తీసుకురావలసిన ఆవశ్యకతను పాలకులు, పండితులు గుర్తించినారు ఈ మహాకావ్యమును ప్రతిభావంతంగా రచించి నిర్వహించినవాడు నన్నయ.

మార్గదర్శి-నన్నయ

తెలుగులో మహాకావ్య రచన గావించిన మొదటికవి నన్నయ భట్టారకుడను సత్యం నిర్వివాదాస్పదమైనది నన్నయ తర్వాత కావ్యరచన గావించిన కవులందరును నన్నయను ప్రథమాంధ్ర కవిగా ప్రస్తుతించినారు. విరాటపర్వంనుండి భారతాన్ని తుదివరకు, అనగా పదిహేను పర్వాలు పూర్తిచేసిన తిక్కన నన్నయను-మొదటి మూడు పర్వాలు వ్రాసిన ఆంధ్రకవితా విశారదుడు, మహితాత్ముడు, విద్యా దయితుడు అని కీర్తించినాడు. తిక్కన తర్వాత కొంతకాలానికి అరణ్య పర్వశేషాన్ని పూరించిన ఎఱ్ఱాప్రెగడ నన్నయనుగూర్చి ప్రస్తావించే సందర్భములో—

ఉ॥ భాసుర భారతార్థముల భంగుల నిక్కమెఱుంగ నేరమిన్
గాసట బీసటే చదివి గాథలు త్రవ్వ తెనుంగు వారికిన్
వ్యాసముని ప్రణీత పరమార్థము తెల్లము జేసినట్టియ
జ్ఞాసన కల్పులందలంతు నార్యుల నన్నయ తిక్కనార్యులన్

(నృ. పు-1 ఎఱ్ఱాప్రెగడ)

నన్నయకుముందు తెలుగువారు గాసట బీసటగా చదివిగాథలు త్రవ్వేవారని ఇందులో స్పష్టముగా ఏఱ్ఱాప్రెగడ చెప్పినాడు. అనగా నన్నయకుముందు తెలుగులో విద్వాంసులు మెచ్చే మహాకావ్యము ఏమియూ లేదన్నమాట. శ్రీనాథ, పోతనవంటి మహాకవులు నన్నయను మొదటి మహాకవిగా పేర్కొన్నారు. వసుచరిత్రను రచించిన రామరాజభూషణుడు

"మహిమన్ వాగనుశాసనుండు సృజియింప
కుండలీంద్రుండు తన్మహనీయ స్థితికి మూలమై నిలువ"

అని చెప్పి నన్నయను ఆదికవి యని వర్ణించినాడు.

నన్నయకు పూర్వం కవిత్వం ఉన్నప్పటికిని ఏ మహాగ్రంథం తెలుగులో రాలేదు. జైన, బౌద్ధ వాఙ్మయాలకు సంబంధించిన గ్రంథాలుకూడా ఏవీ తెలుగులో రాలేదు. నన్నయకు పూర్వం కవిత్వం దేశీమార్గంలో నడిచినది; సాధారణ ప్రజలను రంజింప జేసినది, విద్వాంసుల మెప్పును పొందలేదు; ఒక గ్రంథరూపం దాల్చలేదు. నన్నయకు పూర్వం శాసనాలలో సులక్షణమైన భాష దేశి, మార్గ పద్ధతులను రెండింటిని అనుసరించిన కవిత్వం మనకు కనిపిస్తున్నది. అయితే ఉదాత్త వస్తువులను తీసుకొని మహా కావ్యాన్ని రచించిన గౌరవము నన్నయకు చెందుతున్నది. నన్నయ తన కాలంలో ప్రజల వ్యవహారంలో ఉన్న భాషను బాగా పరిశీలించినాడు. ఆపదజాలాన్ని గ్రంథస్థం గావించడానికి ఒకపద్ధతిని నిర్ణయించుకొని దానిని అనుసరించినాడు. సంస్కృత పదాలను తెలుగుపద్యాలలో సరసంగా పొందుపరచినాడు. ఎక్కడా కుంటుపడని పద్ధతిలో సంస్కృత వృత్తాలను తీసుకొని వాటిని తన రచనలో ఉపయోగించినాడు. ఈపనిలో కన్నడ వాఙ్మయంలో అప్పటివరకు రచితమైన కన్నడ భారతంతోపాటు ఇతర సారస్వతం కొంతవరకు ఉపయోగపడినదని చెప్పవచ్చును. అందుకు అనుగుణముగా భారత రచనను నన్నయ కొనసాగించినాడు. పద్యాలలోనేకాదు వచనరచనలోకూడా నన్నయ తన ప్రతిభను, వైదుష్యాన్ని నిపుణంగా ప్రదర్శించినాడు. అందుచేతనే పద్యవిద్యలేకాదు వచన రచనకుకూడా నన్నయ సరియైన బాటవేసిన మార్గదర్శి అని తెలుగు సాహిత్య విమర్శకుల నిశ్చితాభిప్రాయం. నన్నయ శైలి మనోహరమై, లలితమై, ధారాళమై అలరారుచుండును. చంపకమాల, ఉత్పలమాల మొదలైన సంస్కృత వృత్తాలనేకాక తరువోజ, మధ్యాక్కర మొదలగు దేశి ఛందస్సులనుకూడా నన్నయ చక్కగా

తీర్చిదిద్దినాడు. తరవాత కవులందరు నన్నయను అనుస రించినారు.

తమిళ కన్నడ భాషలలో భారతాలు

అప్పటి వరకు కన్నడ, తమిళ భాషలలో భారతం రచితమైనది, పంపకవి కన్నడ భారతం నన్నయ బాగా చదివి ఉంటాడని ఆయన రచనల వల్ల విశదమౌతున్నది, తమిళ భారతం కూడా నన్నయకు పరిచితమై ఉండవచ్చును. కాని యీ రెండు భాషల భారతాల వలెకాక తెలుగుభారతం విస్తృతమైనదిగా ఉన్నది. కన్నడ భారతంలో మొత్తము గద్యపద్యముల సంఖ్య 1609 తమిళ భారతంలో పది పర్వాలు మాత్రమే అప్పటి వరకు వచ్చినవి. తెలుగు భారతంలో ఒక్క నన్నయ రచించిన భాగంలోనే 4011 పద్యం గద్యాలు ఉన్నవి. అందుచేత తెలుగు భారతం-తమిళ, కన్నడ భారతాలకన్నా ఆదర్శంతోను, ఆకృతిలోను విశాలమైనదని స్పష్ట మగుచున్నది వ్యాసుని భారతాన్ని సమగ్రంగా తెలుగులో వివరించవలెననే సంకల్పం. నన్నయకు సహాధ్యాయియైన నారాయణభట్టు సంకల్పం కూడా ఇదియే కావచ్చును. ఈ ఉభయులు బాగా చర్చించుకొని తెలుగులో భారత రచనకు సమగ్రమైన ప్రణాళికను ఒకటి రూపొందించుకొని ఉండవచ్చును. కన్నడంలో వ్రాసిన పంపని భారతశైలికి ప్రసన్న కవితాగుణం, లలితపద ప్రయోగం ప్రత్యేకతలు. ఈ రెండు గుణాలను నన్నయ ఆదరించి పాటించినట్లు ఆయన రచన స్పష్టంచేస్తున్నది, ఇతర భాషలలో రామాయణ, భాగవతాలకు ప్రశస్తి, ప్రాచుర్యం ఉండగా తెలుగులో భారతానికి అధిక ప్రశస్తి, ప్రాచుర్యం ఉన్నవి. వింటే భారతమే వినవలెను, తింటే గారెలే తినవలెను అన్న సామెత సుప్రసిద్ధమైనది. దీనికి భారత కవుల రచనా పాటవమే ప్రధానకారణం.

తెలుగులో భారత రచన, ముఖ్యంగా నన్నయ రచనను గురించి పరిచయం చేసే సందర్భంలో భారతం దాని ప్రత్యేకత, దానిని ఆంధ్రీకరించవలసిన ఆవశ్యకత, అందుకు రాజరాజు ప్రోత్సాహం, ఆ రాజరాజు చిత్తవృత్తి, ఆయన సభలోని పండిత మండలి, ముఖ్యంగా నన్నయకు సహాధ్యాయుడైన నారాయణభట్టు తోడ్పాటు, ఆతోడ్పాటు విశిష్టత మొదలైన అంశాలను గురించి ప్రస్తావించవలసిన అవసరం ఉన్నది.

భారతాన్ని గూర్చి నన్నయ చెప్పిన మాటలు ప్రత్యేకంగా మనం గమనించవలసి ఉంటుంది. భారతం ధర్మతత్త్వజ్ఞులకు ధర్మశాస్త్రం; ఆధ్యాత్మవిదులకు వేదాంతం; నీతి విచక్షణులకు నీతి శాస్త్రం; కవులకు మహాకావ్యం; లాక్షణికులకు సర్వలక్షణ సంగ్రహం; ఇతిహాసకులకు ఇతిహాసం; పురాణికులకు బహుపురాణ సముచ్చయం-నన్నయ సందర్శించిన మహాభారత స్వరూపమిది. దీనిని వ్రాసినవాడు వేదవ్యాసుడు. ఆయన ఆదిముని, వివిధ వేదతత్త్వవేది, విష్ణుసన్నిభుడు, భారతాన్ని విశ్వజనీనంగా వెలయింపజేసిన మహానుభావుడు. ఈ మాటలు మనం చదివినప్పుడు నన్నయ్యకు భారతం ట్ల, భారతాన్ని రచించిన వేదవ్యాసుని పట్ల ఉన్న గౌరవాభిమానాలు స్పష్టంగా తెలుస్తున్నవి. భారతం ఆయనను ఎంతగా ఉత్తేజపరిచినదో ఇందువలనవెల్లడిఔతున్నది.

రాజనరేంద్రుని సభ

రాజనరేంద్రుని కాలంలో ఆయన కొలువు సరస్వతీ దేవికి నిలయమైనది. రాజమహేంద్ర వరము రాజధానిగా, వేంగి దేశమును పాలించిన రాజరాజు శత్రురాజులకు ఓడించి దేశంలో శాంతిని

స్థాపించెను. కాని ఆయనకు మాత్రము చిత్తశాంతి కలుగలేదు. ఎందుకనగా తెలుగుభాషలో శాశ్వతంగా నిలిచే మహారచన ఒకటి చేయించవలెనని ఆయన ఉద్దేశం. ఆయన మాట్లాడే భాష, ఆయన ప్రజలు మాట్లాడే భాష తెలుగు భాష. ఆ తెలుగులో సరస్వతీ దేవిని సాక్షాత్కరింపజేయవలెనని ఆయన మనోరథం. ఆ రోజులలో సాహిత్యము, మతము, సంస్కృతి అంతయు సంస్కృత భాషనే ఆశ్రయించియుండెను. ప్రజల భాషయైన తెలుగువైపు ఆయన దృష్టి మరలినది. తెలుగులో సాహిత్యరచన చేయగల కవులు చాలామంది ఆయన ఆస్థానంలో ఉండిరి. వారిలో భీమనభట్టు, నన్నయ, నారాయణభట్టు ప్రముఖులుగా ఉండిరి. వీరు అనేక భాషలలో నిష్ణాతులై తెలుగులోను, సంస్కృతంలోను రసవంతమైన కవిత్వం అల్లగలిగిన శక్తివంతులై యుండిరి. రాజరాజు ఆస్థానాన్ని ఒకమారు తిలకించినప్పుడు మనఒడలు పులకరిస్తుంది. మంత్రులు, పురోహితులు, సేనాపతులు, దండ నాయకులు, దౌవారికులు, మహాప్రధానులు, సామంతులతో పాటు శబ్దశాస్త్ర పారంగతులైన వైయాకరణులు; భారతం, రామాయణం మొదలైన పురాణాలలో ప్రవీణులైన పౌరాణికులు; మృదుమధురంగా రస, భావ, భాసుర, నవార్థ భరితమైన, వచనరచనలో విశారదులైన మహాకవులు; వివిధ తర్కవిగాహిత సమస్త శాస్త్ర సాగర గభీయః ప్రతిభులైన తార్కికులు మొదలైన విద్వాంసులు పరివేష్టించి ఉండిది. వీరి మధ్య రాజరాజు విద్వత్ విలాసగోష్టులతో కాలక్షేపం చేస్తుండేవారు. ఆ రోజులలో దేశంలోని విద్వాంసులు, శాస్త్ర పారంగతులు, కవులు మొదలైనవారు రాజరాజును ఆశ్రయించి ఉండేవారని ఇందువల్ల తెలుస్తున్నది. బహుశ ఇటువంటి విద్వజ్జనం వేష్టించిన యీ సభను దృష్టిలో ఉంచుకొనియే కాబోలు నన్నయ తన భారత అవతారికలో సభను కొనియాడినాడు. ఆ కొనియాడేపద్ధతి బహా

రమ్యంగా ఉన్నది. ఈ సభ ఎటువంటిదో ఆయన ఈవిధంగా వర్ణించినాడు.

వ॥ "పరమ వివేకసౌరభ విభాసిత సద్గుణ పుంజవారిజో
త్కర రుచిరంబులై సకలగమ్యసుతీర్థములై మహామనో
హర సుచరిత్ర పావనపయః పరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్"

రాజరాజ నరేంద్రుని సభ వివేకమనే సౌరభంతో ప్రకాశించే సద్గుణ పుంజమనే కమలాలవలన సుందరంగా శోభిల్లుతున్నది; అందరూ సేవింపదగిన తీర్థాలు కలిగిఉన్నది. మిక్కిలి మనోహరములైన మంచి చరిత్రలనెడు పావనజలాలతో నిండిన సత్సభలు అనే పద్మాకరాలను సంతోషంతో కొనియాడుతున్నానని యీపద్యములో నన్నయ రాజరాజు సభను సంస్తుతించి సభ అనగా యిట్లుండవలెనని ధ్వనింపజేసినాడు. ఇటువంటి విద్వత్సభలు నన్నయకు పూర్వము. నన్నయ కాలంలోను ఉండేవని విజ్ఞుల అభిప్రాయం. ఈ విద్వత్సభలు సాహిత్యానికి, కళలకు విజ్ఞానానికి ఐటువ కట్టేవిగా ఉండేవని మనము అనుకోవచ్చును.

తమిళ సాహిత్యంలో సంగవాఙ్మయయుగంలో కవితా తారతమ్య పరీక్షచేసే కవి, పండిత సంఘాలవంటివే రాజరాజు సభ కావచ్చును. అంతకుముందు మనదేశం అంతా వ్యాపించిఉన బౌద్ధ సంఘాలు, సభలు మొదలైనవాటి ప్రభావమే ఈ పండిత కవి సంఘాలు ఏర్పడటానికి కారణము కావచ్చును.

నన్నయభట్టు-రాజరాజు-నారాయణభట్టు

నన్నయభట్టు రాజరాజును వర్ణించిన విధంకూడా విశిష్టంగా ఉన్నది. రాజరాజు రాజులలో ఉత్తమోత్తముడు. తల్లిదండ్రులపై భక్తిగౌరవాలు కలిగి పూజించేవాడు. ఏ వ్యసనములో తగులు కొనక వంశగౌరవాన్ని పాటించి ధర్మమతియై బ్రాహ్మణ ఆశీర్వాదాలు పొందుతూ శిష్టపరిపాలనాసక్తుడై ఉండెను. ఆయన శివపూజా దురంధరుడు, కృపారసబంధురుడు; దయకలిగి బ్రాహ్మణులకు దానాలు చేసే దయార్ద్ర హృదయుడు. రాజవిద్యలో పారంగతుడు; ఏనుగులను, గుర్రాలను స్వారీ చేయడంలో కౌశలంగలవాడు. ధనుర్విద్యలో అసమానుడు. అనేక యుద్ధాలు చేసి సామంత రాజుల నుండి కప్పాలను తీసుకొనుచు కవులను, బ్రాహ్మణులను ఆదరిస్తూ సత్యాశ్రయుడై, సర్వలోకాశ్రయుడై వన్నెకెక్కినాడు. నన్నయకు రాజరాజుపై గల ఆదరాభిమానాలకు యీ వర్ణన మంచి ఉదాహరణ. రాజరాజును ఇంకా అనేక సందార్భాలలో నన్నయపై వర్ణన కనుగుణంగా ప్రశంసించినాడు, వర్ణాశ్రమ ధర్మరక్షణముతో పాటు శరణన్న వారికి ఆశ్రయము; అగ్రజనులకు అగ్రహార ప్రదానము మొదలైన ఉదార గుణాలు కలిగిన అకలంక చరిత్రుడని రాజరాజును నన్నయ వర్ణించినాడు. రాజరాజును నన్నయ వర్ణించిన పద్యాలలో మచ్చునకొక్కటి.

ఉ॥ "రాజకులైకభూషణుఁడు రాజమనోహరుఁ డన్యరాజు తే ।
జోజయశాలి శౌర్యుఁడు విశుద్ధయశశ్శరదిందు చంద్రికా ।
రాజిత సర్వలోకుఁడు పరాజిత భూరి భుజాకృపాణధా ।
రాజల శాంత శాత్రవ పరాగుఁడు రాజమహేంద్రుఁడున్నతిన్."

ఇటువంటిరాజు పైన వర్ణించిన మహాసభలో నన్నయను ఉద్దేశించి భారత రచన తెలుగులో చేయమని అర్థించినాడు. ఇంత మంది సభలో ఉండగా ఈ కార్యానికి నన్నయనే ఎన్నుకొన్నాడు.

భారతం - విశిష్టత

"నేను అనేక పురాణాలు విన్నాను, అర్థ ధర్మశాస్త్రాల క్రమాన్ని తెలుసుకొన్నాను. ఉదాత్త రసాన్వితమైన కావ్యాలను, నాటకాలను ఎన్నో చూచినాను. జగత్పరిపూజ్యములైన ఈశ్వరాగమాలను భక్తితో హృదయంలో నిలుపుకొన్నాను. అయినప్పటికి నాకు మహాభారతంలోని అభిప్రాయాన్ని వినవలెనని కోరిక హెచ్చుగా ఉన్నది. స్వయంగా తనగుణ గణాలను కూడా రాజరాజు సభలో చెప్పుకొన్నాడు, అంతేకాదు చంద్రునితో ప్రారంభమై పూరు, భరత దేశ, కురప్రభు, పాండు భూపతులు తనకు వంశకర్తలని ఈ సందర్భంలో రాజరాజు మరొక మాట కూడా చెప్పినాడు. ఈ పాండవుల చరిత్ర వినడానికి తనకు గాఢమైన కోరిక ఉన్నదని. ఉద్ఘాటించినాడు ఈ విధంగా రాజరాజుకు, నన్నయకు ఉభయులకు భారత మహత్వం మీద ప్రగాఢమైన అభిమానం. భారతం అప్పటి వరకుబహుభాషలలో, బహువిధముల, బహుజనుల వలన రాజరాజు విన్నాడు. దానిని తెలుగులో కూడా వినవలెనని తనకు గాఢమైన కోరిక ఉన్నట్లు ఆయన నన్నయను సభలో విద్వాంసుల సమక్షమున కోరినాడు.

నన్నయ యోగ్యతలు

ఇక నన్నయ యోగ్యతలనుకూడా మనం తెలుసుకోవడం అవసరం. నన్నయ అపస్తంభసూత్రుడు, ముద్గలగోత్రుడు. రాజరాజుకు కులబ్రాహ్మణుడు, అభిమానపాత్రుడు, నిరంతరం జపహోమ

పరాయణుడు, విపుల శబ్దశాసనుడు, వేదసంహితలను అభ్యసించిన వాడు. బ్రహ్మాండపురాణం మొదలైన అనేక పురాణాలను పఠించి అందులోని విజ్ఞానాన్ని తెలుసుకొన్నవాడు, పాత్రుడు; సజ్జనులు ప్రశంసించవలసిన నిష్కళంకమైన చరిత్ర కలిగినవాడు; లోకజ్ఞుడు, సంస్కృతాంధ్రభాషల రెండింటిలో కావ్యరచన చేయగలిగినవాడు; నిత్య సత్యవచనుడు, సుజనుడు, బుద్ధిలో బృహస్పతి. ఆస్థానంలో సర్వజనులకు గౌరవార్హమైన రాజోద్యోగంలో ఉన్నవాడు, అంతేకాదు శాసనాలను వ్రాయించే లేఖనాధికారం కలిగినవాడు. నారాయణభట్టు మొదలైన కవులకు యిచ్చిన అగ్రహారాల దానశాసనాలను నన్నయే వ్రాసినాడు అందుచేత భారత రచనకు నన్నయే సర్వవిధాల అర్హుడని రాజరాజు అభిప్రాయ పడినాడు. కర్ణాటకంలోను, తమిళంలోను భారత రచన జరిగినందువలన తన మాతృభాష, తన ప్రజల మాతృభాషయైన తెలుగులోకూడా ఈ గ్రంథరచన జరుగవలెనని, అది తన ఆశయాలకు అనుగుణముగా ఉండవలెనని ఆయన హృదయాభిలాషి. భారతం హృద్యం, అపూర్వం, సమస్త విజ్ఞానానికి ఆటపట్టు; విశ్వజనీనతకు తావలము. రాజరాజు వైదిక మతాభిమాని. ఈవైదిక మత ప్రచారానికికూడా భారతం సర్వవిధాల అర్హమైనది. ఇటువంటి ఉత్తేజకరమైన సన్నివేశంలో రాజరాజు భారతమును రచించమని కోరగా అందుకు ఆయన వినయభూషణుడై అంగీకరించినాడు. అయితే భారత సముద్రం ఈదడానికి బ్రహ్మకైనా శక్యముకానప్పుడు తనకెంతవరకు శక్యమా అని నన్నయ ప్రశ్నించుకున్నాడు. అందుకు తోడుగా తెలుగుభాషకు సరియైనసౌష్టవముకూడా అప్పటివరకు కలుగ లేదని ఆయనకుతోచి ఉండవచ్చును. అందుచే ఈపని చేయవలసిన బాధ్యత ఉన్నదని నన్నయ భావించినాడు. వ్యవహారంలో ఉన్న తెలుగుభాషకు కావ్యరచనకు కావలసిన రూపాన్ని ఈయడానికి

నన్నయ పూనుకున్నాడు. ప్రారంభదశలో ఈవిధమైన సమస్యలు ఆయనను కొంచెం వెనుకముందాడజేసినప్పటికివి రాజరాజు కోరికను ఆయన అంగీకరించినాడు.

నారాయణభట్టు తోడ్పాటు

నన్నయ సహాధ్యాయుడు నారాయణభట్టు, ఆయన కూడా రాజ రాజు ఆసానాన్ని అలంకరించిన విద్వాంసుడే, ప్రత్యేకంగా నారాయణ భట్టును నన్నయాఖ్యుడు తన అవతారికలో ప్రశంసించినాడు. ఈ ప్రశంస చాలా విశిష్టమైనది. ఆనాడు భారత యుద్ధంలో అర్జునునికి సారధ్యమొనరించి సహాయపడిన నారాయణునివలె తనకు యీ నారా యణుడు తోడ్పడినాడని నన్నయ వ్రాసినాడు. నారాయణభట్టు తనకు సహాధ్యాయుదే కాదు వాఙ్మయ ధురంధరుడు, ధరామర వంశ విభూష ణుడు, సంస్కృత, కర్ణాటక, ప్రాకృత, పైశాచి, ఆంధ్ర భాషలందు కవిరాజ శేఖరుడని కీర్తిగాంచినవాడు. మనీషాలవ దుర్విదగ్ధులైన కవులకు మనోహరములైన కవీభ వజ్రాంకుశుడని బిరుదు పొందిన వాడు. నందమపూడి దానశాసనంలో నారాయణభట్టునుగూర్చి నన్నయ అనేక వివరాలు తెల్పినాడు, నారాయణభట్టు సకల జగదభినుత గుణ శాలి, సరస్వతీ కరుణావతంసుడు, కేవలం పండితుడు మాత్రమేకాదు, రాజనీతి దురంధరుడు. అందుచేతనే రాజనరేంద్రుదాతనికి 'నందమ పూడి'ని అగ్రహారముగా ఇచ్చి గౌరవించినాడు. రాజనరేంద్రుని పరి పాలన స్థిరపడడానికి నారాయణభట్టు రాజనీతిజ్ఞత తోడ్పడినట్లుకూడా తెలుస్తున్నది.

అప్పటివరకు తెలుగులో కావ్యాలులేవు. భారతంవంటి మహా కావ్యాన్ని తొలిసారిగా రచించినప్పుడు అకావ్యం రాజుకు, పండితు లకు సంతృప్తికరముగా వ్రాయవలసి వచ్చినప్పుడు మహాకవిద్వాంసుని

సహాయ సహకారాలు కొంత నిస్సందేహంగా అవసరమే. అటువంటి సహాయాన్ని, సూచనలను సకాలంలో ఆత్మీయుడైన నారాయణభట్టు నన్నయకు చేసినాడని చెప్పవచ్చును. భాష, శైలి, మూలగ్రంథము లోని అర్థం మొదలయినవి నిర్ణయించినప్పుడు ఇతరులు వీనిపై అభిప్రాయ భేదాలు వెల్లడి చేసినప్పుడు నారాయణభట్టు నన్నయకు తోడుగా ఉండి రచనా విధానానికి కావలసిన సూచనలు చేసినట్లు మనం ఊహించవచ్చును. ఈ విధంగా ఒక ఉత్తేజకరమైన సన్నివేశంలో భారత రచనకు అంకురార్పణం జరిగింది. భారతం సకల భారతీయ సంస్కృతికి దర్పణమైన విజ్ఞాన కోశం. అందుచేతనే ఇది ఒక మహత్తరమైన కర్తవ్యంగా పండితులు భావించినారు.

తనకు ఇంతగా ఇష్ట అభిమాన పాత్రుడైన రాజరాజుకు తన భారతాన్ని నన్నయ అంకితము చేయలేదు. అశ్వాస ప్రారంభం లోను, ఆశ్వాస అంతంలోను రాజరాజును ప్రశంసించుతూ నన్నయ పద్యాలు వ్రాసినాడు. ఈ పద్యాలలో రాజరాజు గుణగణాలను అత్యంతంగా వర్ణించినాడు. అయితే యీ పద్యాలు కేవలం సంబోధనలుగానే ఉన్నవి, తాను చెప్పడం రాజరాజు వినడం అనేరీతిలో నన్నయ భారత రచన సాగినది.

అనువాద విధానం

భారతాన్ని అనువాదం చేసే విధానంలో నన్నయ అవలంబించిన పద్ధతులను కూడా గమనించవలసి ఉంటుంది.

రాజరాజు, నన్నయ, నారాయణభట్టు ఈ ముగ్గురి ఆశయాలకు, అభీష్టాలకు అనుగుణంగా తెలుగులో మహాభారత రచన ప్రారంభమైనది. ఈ ఆశయాలలో ఒక ఏకత్వం స్పష్టం కనిపిస్తున్నది. బౌద్ధము,

జైనము, వేదమతముపైన తిరుగుబాటు ఉద్యమాలు; ఆ ఉద్యమాలు క్రమక్రమంగా క్షీణించిన తర్వాత భక్తి ఉద్యమాలైన శైవ, వైష్ణవాలు పరస్పరం సంఘర్షణ పడినవి కూడ. ఇటువంటి స్థితులలో మహాభారత బద్ధ నిరూపితార్థం ఏర్పడగా తెనుగున రచియింపు మని రాజనరేంద్రుడు కోరిన కోరిక ఆనాడు విద్వత్ జనులలోను, పరిపాలకులలోను వైదిక మతము పట్ల ఏర్పడిన ఆదరాభిమానాలకు నిదర్శనం. కాని ఈ వైదిక మతాభిమానం వలన నన్నయ రచనలో సాహిత్య శిల్పం ఏమీ కొరవడలేదని నిస్సందేహంగా చెప్పవచ్చును. సాహిత్య దృక్పథంతో పరిశీలించినప్పుడు మహాభారతం ఉత్తమ శ్రేణికి చెందిన కావ్యమని స్పష్టంకాగలదు. అందుచేతనే ఈ రచనలోని ప్రసన్న కథా కలితార్థయుక్తిని అరసి కవీంద్రులు మేలు మేలని అన్నారట; ఇతరులు అక్షర రమ్యతను ఆదరించినారట. తన్నుతాను నానారుచిరార్థ సూక్తినిధినని నన్నయ చెప్పుకొన్నాడు, భారత రచనను జగత్ హితము అనే ఆశయంతో చేపట్టినానని కూడ ఆయన చెప్పుకొన్నాడు. నన్నయ భారతాన్ని స్వేచ్ఛగా అనువదించినాడు. ఇది స్వతంత్ర కావ్యమని పాఠకులు అనుకోగలిగినంత నిపుణంగా ఈ అనువాద కావ్యాన్ని నన్నయ నెరవేర్చినాడు. నన్నయ కాలంలో భారత రామాయణాదులు సకల భారతంలోని పండితులలోను, ప్రజలలోను వ్యాప్తియందుండెను. భారతము యొక్క భిన్న ప్రతులు ఉత్తరంలోను, దక్షిణంలోను ప్రచారంలో ఉండెను. ఈ ప్రతులలో కొన్ని విభేదాలు కూడా ఉండినట్లు పరిశోధకుల అభిప్రాయం. ఉత్తర, దక్షిణ దేశ ప్రతులు శ్లోక సంఖ్యలో కూడా కొంత వ్యత్యాసం ఉన్నట్లు పండితులు అభిప్రాయ పడుతున్నారు నన్నయ ఏప్రతిని అనుసరించెనో స్పష్టంగా యీనాడు చెప్పడం సాధ్యంకాని పని ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ప్రతుల కన్న నన్నయ అనుసరించిన ప్రతి భిన్నమైనదని డాక్టర్ దివాకర్ల వెంకటావధాని గారి వంటి పండితులు అభిప్రాయపడుతున్నారు. నన్నయ అనేక

ప్రతులు చూచి సందర్భానికి అనుగుణంగా తనకు సముచితంగా తోచిన భాగములను వాని నుండి గ్రహించి యుండవచ్చునని డాక్టర్ దివాకర్ల వేంకటావధాని గారి అభిప్రాయం పూనాలో "భండార్కార్" పరిశోధన సంస్థ భారతాన్ని ఒక ప్రమాణ ప్రతిగా ముద్రించినది. (critical edition of Maha Bharata) దేశంలోని భిన్న ప్రాంతాలలో లభించిన తాళపత్ర గ్రంధాలను పరిశీలించి ఈ ప్రామాణిక ప్రతిని భండార్కార్ పరిశోధనా సంస్థ సిద్ధము చేయించినది. ఈ సందర్భంలో భండార్కార్ సంస్థ తెలుగు భారతాన్ని కూడ పరిశీలించినట్లు తెలుస్తున్నది. తెలుగు భారతం కడమ దక్షిణ దేశ భారతాలకన్న బండార్కార్ సంస్థకు ఎక్కువగా ఉపయోగపడినట్లు ఒక అభిప్రాయం. ఇది ఏమైన ప్పటికిని దక్షిణదేశ భారతాలన్నింటి కంటె తెలుగు భారతం మూలానికి సన్నిహితంగా ఉన్నదని పండితుల అభిప్రాయం.

వ్యాసుడు-నన్నయ

వ్యాసునికి. నన్నయకు మధ్య సుమారు రెండు వేల సంవత్సరాల కాలం గడిచినది. ఈ రెండువేల సంవత్సరాలలో సాంఘికంగా, రాజకీయంగా, మతపరంగా దేశంలో ఎన్నో మార్పులు వచ్చినవి. ఈ మార్పులను తెలుగులో భారతం వ్రాసిన కవిత్రయం గమనించినదని చెప్పవచ్చును. ఇందువలననే కాబోలు మూలంలోని కథను కొన్ని సందర్భాలలో తగ్గింపులను మరికొన్ని సందర్భాలలో పొడిగింపులను కవిత్రయం చేసినది. చాలాచోట్ల మూలంలోని భాగాలను నన్నయ సంగ్రహించినాడు. అయితే ముఖ్యభావాలకు ఎక్కడా లోపం రానీయలేదు అని పండితుల అభిప్రాయం. మూలంలో కొన్ని కథలు రెండుసార్లు చెప్పబడినవి, కాని నన్నయ ఆకథను ఒకేసారి సరియైన సందర్భంలో చెప్పినాడు. కొన్ని సందర్భాలలో నన్నయ

మూలంలోని భావాలను పూర్తిగా విడిచివేసినాడు. మూలంలోని భావాలను వివరించినప్పుడు కొన్ని సందర్భాలలో స్వతంత్రంగా పద్యాలు వ్రాసిన నిదర్శనాలుకూడా ఉన్నవి.

నన్నయ-సంస్కృత కర్ణాటక కవులు

భారతాన్ని అనువదించే సందర్భంలో నన్నయ ఇతర సంస్కృత మహాకవుల రచనలనుండి సందర్భోచితమైన భావాలను గ్రహించినట్లు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. నన్నయ, నారాయణభట్టు ఉభయులు తెలుగు, సంస్కృతము, ప్రాకృత భాషల లోనేకాక కర్ణాటకంలోకూడా విద్వాంసులు. అప్పటివరకే కర్ణాటక భారతం వచ్చినందున పంపని శైలికి, నన్నయభట్టు శైలికి తగినన్ని పోలికలు ఉన్నందువలన రచనలో కర్ణాటక భారతాన్నికూడా నన్నయ దృష్టిలో ఉంచుకొన్నాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. నన్నయ భారతం కావ్యదృష్టితో పరిశీలించినప్పుడు అది ఒక స్వతంత్రరచనగా శోభిల్లుతున్నదని అందరు అంగీకరించిన అభిప్రాయం.

నన్నయ కథాకథనం

కథను చెప్పడంలో నన్నయకు ప్రత్యేకనైపుణ్యం ఉన్నది. మూలంలోని కథను తీసుకొని దానిని సందర్భోచితంగా తగుమార్పు లతో నన్నయ వివరించుచుండును. మూలంలోని భారతం ఇతిహాసం; తెలుగులోని భారతం కావ్యము అని చెప్పవచ్చును, దీనికి కావ్యరూపం ఈయడానికి కావలసిన విధంగా నన్నయ రసపోషణం, పాత్రపోషణం గావించినాడు,

నన్నయ శైలి

నన్నయకుముందు తెలుగులో కావ్యాలు ఏవీ లేనందువలన కావ్యాలలో ఉపయోగించవలసిన శైలిని నన్నయే రూపొందించుకున్నాడు. సంస్కృత భాషాప్రధానమైన శైలి నన్నయ రచనకు వన్నె పెట్టినది. కవిత్వమునకు కావలసిన సంక్షిప్తత దీనివలన చేకూరినది. ఆయన రచనలో సంస్కృత దీర్ఘసమాసాలు ఎక్కువగా కనిపించినను అందులో క్లిష్టత కనిపించదు. అన్వయ కాఠిన్యముగాని, అర్థకాఠిన్యముగాని ఆయన రచనలో గోచరించవు. ఆపాతమధురము, ఆలోచనామృతము అయినది నన్నయ రచన. కవీంద్రుల కొరకు "ప్రసన్న కథాకలితార్థయుక్తి"తో రచన చేసినాడు; సాధారణ పాఠకులకొరకు "అక్షర రమ్యత"ను అనుసరించినాడు; సామాన్యులకొరకు "రుచిరార్థసూక్తి"లను చేర్చినాడు నన్నయ. నన్నయ కవిత్వానికి గాంభీర్యము ప్రాణమని విమర్శకుల అభిప్రాయము. శబ్దగాంభీర్యము, అర్థగాంభీ ము- రెండును నన్నయ కవితలో గోచరించును. సంయమనం నన్నయ రచనలో ప్రధానంగా గోచరించును. కథను చక్కగా, ప్రసన్నముగా చెప్పడంపైననే నన్నయకు దృష్టి ఎక్కువ. కథాగమనానికి భంగం కలిగించే రసావేశము, వర్ణనాబాహుళ్యము నన్నయలో ఉండవు. అందువలన రచనారీతి, కథాకథనపద్ధతి సరళముగా ఉండి అర్థముకావడంలో క్లిష్టత ఉండదు. ఆయన సంభాషణలు సరళముగా, సహజముగా నుండును. ఆయన పాత్రలు రసావేశముతో మాట్లాడవు. ఆయన పాత్రలు సహజంగా నిరాడంబరంగా ఉండును.

నన్నయ సంస్కృత పదభూయిష్ఠమైన పద్ధతిలోనే ఎక్కువగా రచన చేసినప్పటికిని ఆయన భాషలో తెలుగు నుడికారము కూడా

కనిపించును. ఆయన సంస్కృత సమాస భూయిష్ఠ రచనను చేయడంలో ఎంత చెయ్యి తిరిగినవాడో, ప్రసన్న పద్ధతిలో అలతి అలతి తెలుగు మాటలలో రచన చేయడంలో కూడా అంతటి సామర్థ్యము కలవాడు.

దీర్ఘ సంస్కృత సమాలోచనకు ఒక ఉదాహరణ :

మ॥ వివిధోత్తుంగ తరంగఘట్టన చలద్వేలావనై లావలీ
లవలీలుంగలవంగ సంగతలతాలాస్యంబు లీక్షించుచున్
ధవళాక్షుల్ సనికాంచిరంత నెదురంద త్తీర దేశంబునం
దవదాతాంబుజ ఫేనపుంజ నిభునయ్యశ్వోత్తమున్ దవ్వులన్॥

సరళము, ప్రసన్నము అయిన నన్నయ శైలికి
ఒక ఉదాహరణ :

ఉ॥ నిండుమనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతముగావున విప్రుడోపునో
పండిత శాంతుడయ్యు నరపాలుడు శాపముగ్రమ్మరింపగన్.

తెలుగు సాహిత్యంలో ప్రధానంగా రెండు మార్గాలు, రీతులు కనిపించునని విమర్శకుల అభిప్రాయము. సంస్కృత పదజాలముతో నిండి, అక్షరరమ్యమై, కథాకథన ప్రధానమైన మార్గమొకటి; దేశీయ పదములతో నిండి, భావావేశముతో కూడిన రసప్రధానమైన మార్గము మరియొకటి. మొదటిది నన్నయ రీతికాగా రెండవది తిక్కన మార్గము. తరువాత ఆంధ్రకవులు చాలామంది నన్నయ మార్గమునే అనుసరించినారు. నన్నయ రచనలోని ధారాశుద్ధి, పద్యరచనాశిల్పము

చాలామంది కవులను ఆకర్షించినది. అందుకే నన్నయ వాల్మీకిని గురించి వ్రాసిన "గురు పద్యవిద్యకు ఆద్యుడు" అనుమాట తెలుగు కవులలో నన్నయకు సరిపోవునన్న విశ్వనాథ సత్యనారాయణగారి అభిప్రాయము - సరియైనదేనని చెప్పవచ్చును. కాలము రీత్యానేకాదు, గుణమురీత్యాకూడా నన్నయ ఆదికవి; తిక్కనపైకూడా నన్నయ ప్రభావము కలదు; ఎర్రనపై చెప్పవలసిన పనిలేదు. దేశిమార్గము ననుసరించిన శైవకవులైన పాల్కురికి సోమనాథాదులపైననే నన్నయ ప్రభావము గోచరించును. శ్రీనాథుడు నన్నయ మార్గమునే అవలంబించి, ప్రబంధకవులకు శైలీభిక్ష పెట్టినాడు. లిఖిత సాహిత్యము లేని జాతి నాగరికతలేని జాతిగా భావించబడుతోంది. ఈ లోపమును పూరించి జాతి ఔన్నత్యమునునిలిపి, ఆంధ్రులకు ప్రాచీనసాహిత్యము కలదన్న గౌరవమును నిలిపినాడు నన్నయ, ఆంధ్ర కవిత్వమును సంస్కృత ధోరణిలో రూపొందించి పండితాదరణను కూర్చినాడు. సమగ్రమైన ఆంధ్రమయీ వాక్కులకు ఆచార్యుడైనాడు. ఆయన భాష. ప్రయోగములు, రచనారీతులు ప్రామాణికములై అనంతర కవులకు మార్గదర్శి అయినాడు.

తిక్కన-భారత రచన పూర్తి

ఆది, సభాపర్వాలను- అరణ్యపర్వంలోని కొంతభాగాన్ని రచించిన తర్వాత నన్నయ భారత రచన ఆగిపోయినది. తిరిగి భారత రచన ప్రారంభం కావడానికి కొంతకాలము పట్టినది. నూటయాభై సంవత్సరాలవరకు పూర్తిగావించే ప్రయత్నాలు జరుగలేదు. అప్పటి దేశకాల పరిస్థితులు ఇందుకు కారణమై ఉండవచ్చును. పదమూడవ శతాబ్దం అనగా క్రీ.శ. 1210-1290 మధ్యన జీవించి నెల్లూరును పరిపాలించిన మనుమసిద్ధి రాజుకు మంత్రిగా, అస్థానకవిగా ఉండిన తిక్కన భారతాంధ్రీకరణ చేపట్టినాడు. కాని ఆయన అరణ్యపర్వంలో

మిగిలిన భాగాన్ని పూర్తిచేయక విరాటపర్వంనుండి ప్రారంభించి పది హేను పర్వాలు ప్రతిభావంతంగా ఆంధ్రీకరించినాడు. తిక్కనది సంభాషణాత్మక శైలి, నాటకీయ రచన, ఆయన యుద్ధవర్ణనలు అప్రతిమానమైనవి. తెలుగుపదాలను తిక్కన ఎక్కువగా వాడినాడు. తెలుగులో ఆధ్యాత్మిక రాజకీయాది అనేకవిషయాలుకూడా గంభీరంగా హృదయంగమంగా వ్యక్తం చేసినాడు, రసానికి అనుకూలమైన వృత్తాలను ఆయన ఉపయోగించినాడు. అన్నిరసాలను మనోరంజకంగ పోషించినాడు. పాత్రపోషణలో సాటిలేని నేర్పు చూపినాడు. జన వ్యవహారంలో ఉన్న తెలుగు పదజాలానికి కావ్యగౌరవం ఆపాదించినాడు. తిక్కన రచన తెలుగుదనానికి ప్రతిబింబమై, సరసమై, సుందరమై గంభీరమై అలరారుచుండునని విద్వాంసుల అభిప్రాయం.

ఆంధ్రావళికి మోదము కలుగవలెననే మహోన్నతమైన లక్ష్యంతో తిక్కన భారత రచన గావించినాడు. ఒక మహాకవిత్వ దీక్షావిధిని పొంది పద్యములను, గద్యములను రచించెదని ఆయన చెప్పుకొన్నాడు. తిక్కన తన కావ్యాన్ని హరిహరనాథునికి అంకితము గావించినాడు. పన్నెండవ శతాబ్దమున తెలుగుదేశంలో శైవ, వైష్ణవ మతాలు వ్యాపించి పరస్పరం సంఘర్షణకూడా పడినవి. అందుచేత ఈ సంఘర్షణ సరికాదని భావించి శివకేశవుల అభేదాన్ని ఉద్ఘాటించి ధర్మాద్వైతాన్ని స్థాపించే ఉద్దేశంతో తిక్కన భారత రచన గావించినాడు.

నన్నయ-ఎఱ్ఱనలు

పూర్తిగాక మిగిలిన అరణ్యపర్వాన్ని పద్నాల్గవ శతాబ్దంలో నివసించిన ఎఱ్ఱన పూర్తిగావించినాడు. ఎఱ్ఱన అరణ్యపర్వశేషంతో పాటు నృసింహపురాణాన్ని, హరివంశాన్ని కూడా వ్రాసినాడు. ఆయన

రామాయణం కూడా వ్రాసినాడు. కాని అది యీనాడు దొరుకుటలేదు. ఎఱ్ఱన అరణ్యపర్వశేషాన్ని నన్నయ పేరుతోనే ఆంధ్రీకరించి రాజరాజునే సంబోధించినాడు. నన్నయపైన ఎఱ్ఱనకున్న భక్తిగౌరవాలకు ఇది తార్కాణం. అరణ్యపర్వశేషాన్ని నన్నయ శైలితో మొదలు పెట్టి తిక్కన శైలితో ఎఱ్ఱన ముగించినాడనీ; ఆయన కవిత్వం నన్నయ, తిక్కన అను రెండు మహాసముద్రాలను కలిపే జలసంధి వలె ఉన్నదని పండితుల అభిప్రాయం. ఈవిధముగా మహాభారత రచన పదకొండవ శతాబ్దంలో ప్రారంభమై పధ్నాల్గవ శతాబ్దంలో ముగిసినది.

తెలుగులో మహాభారతం ఉత్తమోత్తమమైన గ్రంథం. ఈ గ్రంథానికి యిటువంటి గౌరవం కలగడానికి కారణం కవిత్రయం యొక్క ప్రతిభాసంపదయే. తర్వాత ఎవ్వరు ఎన్నికావ్యాలు వ్రాసినప్పటికిని అందరికి భారతమే మార్గదర్శకం. పండితులు, పామరులు అందరు సమానంగా ఆదరించే మహారచన తెలుగుభారతం. ఇతర భాషలలో భారతానికిలేని మహోన్నత స్థానం తెలుగుభాషలో ఉన్నది.

నన్నయ - సారస్వతమూర్తి

నన్నయ యొక్క శైలి మిక్కిలి మనోహరమైనది, అనన్య తుల్యము. దానివంటిది వేఱొండులేదు. సంస్కృతపద భూయిష్ఠమై యున్నను అర్థకాఠిన్య మేమాత్రము లేనిది. అతడు ఉపయోగించు తత్సమములు, ఇతరు లనేకులువాడు తెలుగుపదములకన్న శబ్దము నందును, అర్థమునందును సరళములు. సాధారణముగా సంస్కృత పదములను, సమాసములను ప్రయోగించువారు ఆడంబరములను ప్రకటింతురు; ఆ పద్ధతికి అనుకూలించిన స్థలముల మాత్ర మట్టి శైలిని వ్రాయుదురు. నన్నయయొక్క జాలమేమనగా తత్సమపద భూయిష్ఠమైన శైలిని మృదుత్వము, మాధుర్యము మొదలగు కోమలములైన గుణములకును సంయోగము స్థాపించుట. ఈ మహాత్మ్యమితని యందట్లు ఎర్రనలో కలదు. నన్నయలో సాంస్కృతి కాన్వయములు తరచుగాగలవు. అవియు పద్యమును గంభీరముగా శబ్దించునట్లు చేయునుగాని విషయ వైశద్యమునకు, అర్థస్పాష్ట్యమునకు నేమాత్రము భంగకరములు కావు.

నన్నయ "గురుపద్యవిద్యకు నాద్యు" డగుటయు కాదు. గద్యవిద్యకు నాతడు ఆద్యుడు. ఆంధ్రమున వచనము నితడు వ్రాసినంత మనోహరముగా వ్రాసినవారు ఒరులులేరు. చిన్నయసూరి యితని జూచియే వచన రమణీయమైన మిత్రలాభమును రచించియుండునని తోచెడిని.

(వేంగీ సంచిక. -కట్టమంచి రామలింగారెడ్డిగారు)
ప్రచురణ, ఆంధ్రదేశ యైతిహాసిక
పరిశోధకమండలి, రాజమండ్రి

భారతాంధ్రీకరణ పద్ధతి :

నన్నయగాని- తదుపరి, తిక్కన, ఎఱ్ఱనలుగాని సంస్కృత భారతమును ఎంతవరకు అనుసరించిరో ఎంతవరకు అనువదించిరో తెలిసికొనుట చాల దుష్కరము. ఏమన సంస్కృత భారతప్రతులు, అనేక రాష్ట్రములలో అనేకరీతులుగా ఉన్నవి. వాటిలో ఉత్తరదేశ ప్రతులకును దక్షిణదేశ ప్రతులకును చాలా వ్యత్యాసములున్నవి. ఉత్తరాది ప్రతులలోకూడ ఒండొకటికిని భేదమున్నది. వాటిలోనుండు కొన్ని ప్రకరణములు, ఉపాఖ్యానములును వీటిలో కనబడవు. అట్లే వీటిలోనుండునవి వాటిలో కానరావు. అందును, ఇందును సమానముగానున్న భాగములయందైనను శ్లోకసంఖ్య సరిపోదు. మూల భారతము పుట్టిన పిమ్మట గడచిన ఇన్నివేల సంవత్సరములలో ప్రతులు వ్రాసికొనువారు ఎవరికి తోచినట్లు వారు కొన్ని శ్లోకములు కల్పించి, కొన్నిటిని తొలగించి కొన్ని ప్రకరణములను పెంచి కొన్నిటిని తగ్గించియుందురు. కావున సమగ్ర గ్రంథమునకు యథాతథముగా దక్కలేదు. ఈ తారుమారు నన్నయనాటికే జరిగినది. ఎట్లనగా నన్నయకు పూర్వము కొన్నివందల సంవత్సరములనాడే జావా ద్వీపమునకు తరలిపోయిన భారతము ఉత్తరదేశ ప్రతులకంటె కొంచెము భిన్నముగా దక్షిణదేశ ప్రతులలో కొన్నిటిని పోలియున్నదట! ఇది సహజమే; బలి, జావా మొదలగు ద్వీపములకు వలసపోయిన భారతీయులు పూర్వకాలపు కళింగాంధ్రమునుండి తూర్పు సముద్రము తరించిపోయినవారేగాన, వారు తమవెంట కొనిపోయిన భారతము మనదేశమున అప్పుడు ప్రచారములోఉన్న భారతప్రతికి ప్రతియై

యుండును. దానికిని నన్నయ పర్వసంగ్రహములో చెప్పిన శ్లోక సంఖ్యకును ఎక్కువ తేడాలేదట. మరి అరవదేశమున గ్రంథలిపిలో కానవచ్చు భారతమునకును, దానికిని ఎంతో భేదము లేదట. నన్నయ పర్వ సంగ్రహములో గణనచేసిన శ్లోకసంఖ్య లక్షకుమించి ఉన్నను (1,00,700) ఆనాటి తెలుగుదేశమున ప్రచారముననున్న భారతము ఇంచుమించు లక్షశ్లోక పరిమితమైయుండుట బట్టి అదే ఎక్కువ ప్రక్షిప్తములు లేని మూలభారతముగ నన్నయ స్వీకరించి యుండును. కవిత్రయమువారు ముగ్గురును దాక్షిణాత్యులే గనుకను ఆంధ్రులే గనుకను ఆంధ్రదేశమున మొదట నన్నయకులభించిన ప్రతివంటివే తక్కిన ఇరువురుకును లభించియుండు ననుకొనుటలో సామంజస్యము కలదు. ఇటీవల వ్యాసభారత పాఠనిర్ణయమును గూర్చి భారతదేశమున పరిశోధనలు చేయుచున్న విద్వత్సంస్థలు నన్నయనాటికి తెలుగుదేశమున ప్రచారములోనున్న తెలుగుభారతమే తక్కినవాటికంటె మూలభారతమునకు ఎక్కువ సన్నిహితముగ ఉన్నదని ఒప్పుకొనిరి దానిని బట్టియే కీ. శే. P.P.S శాస్త్రి సంపాదకత్వమున నాగరలిపిలో వావిళ్ల వారు అచ్చువేసిన భారతము నన్నయ గణించిన పర్వసంగ్రహ శ్లోక సంఖ్యకు అనుగుణముగ పరిష్కరింపబడినది. శ్రీశాస్త్రిపరిష్కరించిన ఈభారతప్రతి దక్షిణదేశమునందు తెలుగులిపిలో, గ్రంథలిపిలో లభించిన ప్రతులన్నింటి తోడ్పాటుచే నిర్ణయింపబడినది. కావున తెలుగు భారతమును మూలముతో పోల్చిచూచినపుడు ఆప్రతినే ఆధారముగా గైకొన్నచో ఎక్కువ దారి తప్పిపోకుండ నడువవచ్చును.

నన్నయ కథామాత్ర ప్రధానమును, యథోచితానుసరణమును ఐన అనువాదమునే ప్రారంభించెను గాని, మూల విధేయముగా యథాతథముగ తెనిగింపపూనుకొనలేదు. అట్లని మిక్కిలి స్వతంత్రించి మూలమునకు దూరముగ తొలగిపోలేదు. సందర్భవశమున ఒకమూల శ్లోకము రమణీయమని తోచినపుడు మురిపెముతో దానిని ఒక పద్యమున తెనిగింపకపోలేదు.

(ఆంధ్ర సాహిత్య చరిత్ర,
—ఆచార్య పింగళి లక్ష్మీకాంతం)
(ప్రచురణ - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి)

నన్నయ ఆంధ్ర భాష కొనరించిన సేవ :-

ఆ యారంభ దినములలో నన్నయ ఆంధ్ర భాష కొనరించిన సేవయంతింతనరానిది. అతడు జనవ్యవహారము నందలి పదజాలము నంతయు పరిశీలించి, సంస్కరించి, సంస్కృత పదములను తెలుగున వాడు పద్ధతి నిర్ణయించి, ధారాళమైన నడకగల కొన్ని సంస్కృత వృత్తములను గ్రహించి, తన నాటికే ఉత్తమ కావ్యములతో నొప్పారుచుండిన కన్నడ వాఙ్మయము నుండి ప్రశస్త లక్షణములు సేకరించి, తెలుగున ఉత్తమమైన కావ్య రచన మార్గము తీర్చిదిద్దెను. ఇది అనన్య సామాన్యమైన అతని ప్రతిభా మహత్త్వమునకు తార్కాణము.

నన్నయ ఆంధ్ర భారతమునందు ఆది, సభా పర్వములను, అరణ్య పర్వమునందు మూడు ఆశ్వాసములపై 142 పద్యములను మాత్రమే రచించెను. అతడు వ్యాసుని సంస్కృత భారతము నందలి కథను అనుసరించిన మాట నిజమేయైనను అందు తనకు అనవసరము లని తోచిన భాగములను తగ్గించి, అనవసరములని తోచినట్లు పెంచి, యౌచిత్య దృష్టితో కొన్ని మార్పులొనరించి, తనకృతిని సర్వవిధ ముల ఒక స్వతంత్ర కావ్యమా అనునట్లు సాగించెను. అతని కవిత్వము ప్రసన్న కథాకలితార్థయుక్తికిని, అక్షరరమ్యతకును, నానా రుచిరార్థసూక్తి సంపదకును నెలవై వీనులవిందు చేకూర్చుచుండును. ఉదంకోపాఖ్యానము, శకుంతలోపాఖ్యానము, నలోపాఖ్యానము, సౌగంధికా పహరణము, రురుప్రమద్వరల కథ మున్నగు వృత్తాంత ముల రచించుటలో నాతడు చూపిన నేర్పు అప్రతిమానమైనది. అతని కవిత్వము సంస్కృత పద బహుళమయ్యును క్లిష్టాన్వయములు లేక ధారాశుద్ధికిని, ధ్వని గాంభీర్యమునకును నిధానమై చదువరులకు ఆనందము కూర్చుచుండును. ఆంధ్రమున గురుపద్య విద్యకు వలెనే గద్య

విద్యకును నన్నయయే ఆద్యుడని చెప్పవచ్చును. అతని వచనము సులలిత పదఘటితమై అతి ధారాళమై ఒప్పారుచుండును. అతడు చంపకమాల ఉత్పలమాల వృత్తములనే కాక తరువోజ, మధ్యాక్కర మున్నగు దేశిపద్యములను కూడా వాడియుండెను. ఆంధ్రమున కావ్యములను వ్రాసిన తరువాతి కవులెల్లరు అతని గురుప్రాయునిగా భావించికొనియాడిరి.

రాజరాజు మరణించిన పిమ్మట కొన్ని రాజకీయ, మత, సాంఘిక కారణములచే ఆంధ్ర భారత రచన కొనసాగుటకు అంతరాయ మేర్పడినది. రాజరాజు కుమారుడైన కులోత్తుంగ చోడుడు తండ్రి తరువాత వేంగీ సామ్రాజ్యమును పాలింపక మాతామహ రాజ్యమైన చోళ రాజ్యమునకు అధిపతి యయ్యెను. అది తమిళ భాషా ప్రచారముగల దేశమగుటచే అతడు అచ్చటి నుండి ఆంధ్ర భాషను పోషించుటకు అవకాశము లేకపోయెను. క్రీ. శ. 12వ శతాబ్ది ఆరంభమున కన్నడ దేశమున బసవేశ్వరుడు అవతరించి వీరశైవ మతమును స్థాపించెను. ఈ క్రొత్త మతము వర్ణాశ్రమ వ్యవస్థను గాని, వేద ప్రామాణ్యమును గాని అంగీకరింపక భక్తి ప్రధానమై ఉండెను. దీని ప్రభావము కన్నడ దేశము నుండి క్రమక్రమంగా దక్షిణము నందంతటను ప్రాకెను. ఈ విధంగా ఒక వంక వీరశైవము వ్యాప్తి చెందుచుండగా ఆంధ్రదేశమున దానికి ప్రతియోగముగా రామానుజుడు స్థాపించిన వైష్ణవము కూడా పెంపొందనారంభించెను. భక్తి ప్రధానములైన ఈ మతముల నవలంబించి తత్ప్రచారములకై యత్నించుచుండిన కవులు వైదికమత ప్రధానమైన భారతమును కొనసాగించినవారు కాకపోయిరి.

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర —డాక్టర్ దివాకర్ల వేంకటావధాని
(ప్రచురణ ఆంధ్ర సారస్వత పరిషత్తు)

నన్నయ కవిత - మచ్చుతునకలు

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ శ్రీకన్ధరా శ్శ్రేయసే.

క. బహుభాషల బహువిధముల
బహుజనములవలన వినుచు భారతబద్ధ
స్పృహు లగువారికి నెప్పుడు
బహు యాగంబులఫలంబు పరమార్థమిలన్.

ఉ. పరమవివేకసౌరభవిభాసితసద్గుణపుంజవారిజో
త్కరరుచిరంబులై సకలగమ్యసుతీర్థములై మహామనో
హరసుచరిత్రపావనపయఃపరిపూర్ణములైన సత్సభాం
తరసరసీవనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్.

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని
కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని
యైతిహాసికు లితిహాస మనియు
పరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చయం బని
మహిఁ గొనియాడుచుండ.

ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండఁ జేసె భారతంబు.

మ. అమితాఖ్యానక శాఖలంబొలిచి వేదార్థామలచ్ఛాయమై
సుమహద్వర్గ చతుష్కపుష్పవితతిన్ శోభిల్లి కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థఫలమై ద్వైపాయనోద్యాన జా
తమహాభారతపారిజాత మమరున్ ధాత్రీసురప్రార్థ్యమై.

మానిని. ఏచి తనర్చి తలిర్చిన క్రోవుల నిమ్మగు తావుల జొంపములం
బూచిన మంచియశోకములన్ సురపొన్నలఁ బొన్నల గేదఁగులం
గాచి బెడంగుగఁ బండిన యాసహకారములం గదళీతతులం
జూచుచు వీనుల కింపెసఁగన్ వినుచున్ శుక కోకిల సుస్వరముల్.

సీ. శ్రవణసుఖంబుగా సామగానంబులు
చదివెడు శుకముల చదువు దగిలి
కదలక వినుచున్న కరులయు గరి
కర శీతలచ్ఛాయఁ దచ్చికరాంబు
కణముల చల్లనిగాడ్పుసపడి దానిఁ
జెందిసుఖంబున్న సింహములయు
భూసురప్రవరులు భూతబలుల్ దెచ్చి
పెట్టు నీవారాన్న పిండతతుల

తే. గడఁగి భక్షింప నొక్కటఁ గలసి యాడు
చున్న యెలుకలుఁ బిల్లులయొండు సహజ
వైరి వర్గంబులయు సహవాస మపుడు
సూచి మునిశక్తి కెంతయుఁ జోద్య మంది

సీ. ధర్మార్థ కామ సాధన కుపకరణంబు
గృహనీతి విద్యకు గృహము విమల
చారిత్ర శిక్షకాచార్యకం బన్వయస్థితికి
మూలంబు సద్గతికి నూఁత
గౌరవంబున కేకకారణం బున్నతస్థిర
గుణమణుల కాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ, దూవె
భర్తకు నొండ్లుగావు ప్రియము

ఆ. సెట్టి పట్టములను నెట్టి యావదంను
నెట్టి తీరములను ముట్టఁబడిన
సంత సెల్లఁ జాయు సింతుల ప్రజలను
నొనఁ జూడఁ గలిగ దనుల కెడు.

చ. నుతజలపూరితంబు లగు నూతుల నూఱిటి కంటె సూనృత
వ్రత యుతబావి మేలు మఱి బావులు నూఱిటి కంటె నొక్క స
త్క్రతు వది మేలు తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు త
త్సుతశతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడఁగన్

కం. తెలియంగ నశ్వమేధం
బులు వేయును నొక్క సత్యమును విరుగడలం
దులఁ దూఁచగ సత్యము
వలనన ముల్లు మొగ్గు గౌరవంబున పేర్మిన్.

తే. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుఁగావు
ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.

లయగ్రాహి.

కమ్మని లతాంతములకు మ్మొనసి వచ్చు
మధుపమ్ముల సుగీతనినదమ్ము లెసఁగెం జూ
తమ్ముల నసత్కిసలయమ్ముల సుగంధిముకుళమ్ములను
నానుచు ముదమ్మొనర వాచా
లమ్ములగు కోకిలకులమ్ములరవమ్ము
మధురమ్మగుచు విన్చె ననిశమ్ము సుమనోభా
రమ్ముల నశోకనికరమ్ములును
జంపకచయమ్ములును గింశుకవనమ్ములును నొప్పెన్.

లయగ్రాహి,

చందనతమాలతరులందునగరుద్రుమములందుఁ
గదళీవనములందు లవలీమా
కందతరుషండములయందు
ననిమీలదరవిందసరసీవనములందు వనరాజీ
కందళితపుష్పమకరందరసముం
దగులుచుం దనువు సౌరభమునొంది జనచిత్తా
నందముగఁ బ్రోషితుల డెందముల లలరంగ
మందమలయానిలమమంద గతి వీచెన్.

క. తన కపకారము మును జే
సిన జనుఁ డల్పుఁడని నమ్మి చేకొని యుండం
జన దొకయించుకముల్లయి
నను బాదతలమున నున్న నడవఁగ నగునే.

క. కృతమెఱుఁగుట పుణ్యము స
న్మతిదానికి సమము సేఁత మధ్యము మఱి త

త్కృతమున కగ్గలముగ స
త్కృతిసేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్.

క. ధృతిసెడి వేఁడెడు వానిని
నతిథిని నభ్యాగతుని భయస్థుని శరణా
గతుఁజంపఁగ నొడఁబడు దు
ర్మతి కిహము౦ బరముఁగలదె మదిఁ బరికింపన్.

ఆ. పరులవలన బాధ వొరయకుండఁగ సాధు
జనుల ధనము గాచు జనవిభుండు
కరుణ దప్పి తాన హరియించువాఁడగు
నేని, సాధులోకమేమి సేయు.

ఆ. కీర్తిలేనివానికిని జీవనంబు ని
రర్థకంబచూవె, యవనిమీఁద
నిత్యమయిన ధనము నిర్మల కీర్తియః
యట్టికీర్తి వడయు టర్శమంబె.

ఆ. వార్తయంద జగము వర్తిల్లు చున్నది
యదియు లేవినాఁడ యఖిలజనులు
నంధకారమగ్నులగుదురు గావున
వార్త నిర్వహింపవలయుఁ బతికి.

మత్తకోకిలము.
స్నాతకుండును ఋత్విజుండును సద్గురుండును నిష్టుఁడున్
భ్రాతలేకుఁడు సంయుజుండును బూజనీయులు వీరిలో
బ్రీతినెవ్వఁడు సద్గుణంబులఁ బెద్దయట్టి మహాత్ము వి
ఖ్యాతుఁ బూజితుఁజేయు మొక్కనిఁ గౌరవాన్వయవర్ధనా.

తే. క్షత్త్రనీతిక్రమంబులు గావు సూవె
వికృతియును జూదమును; ధర్మనిత్యులైన
వారికీరెండు వర్జింపవలయు; నేఁడుఁ
బాపవృత్తంబు జూదంబు పార్థివులకు.

ఆ. కుటిలమార్గు లయిన కుత్సితకితవులఁ
తోడఁగడఁగి జూద మాడఁజనదు
దానఁజేసి యర్థ ధర్మవివర్జితు
లగుదు రెట్టివారు జగములోన.

తే. ప్రియము పలికెడు వారిన పెద్దమెత్తు
రప్రియంబును బథ్యంబునైనపలుకు
వినఁగ నొల్లరు; గావున వేడ్కఁ దానిఁ
బలుక రెవ్వరు నుత్తమప్రతిభులయ్యు.

తే. మొదల నప్రియ మయ్యును దుదిఁ గరంబు
పథ్యమగు పల్కు ప్రియులందు బలిమినైనం
బలుక వలయు; మోమోడక యొలసి యట్టి
వాఁడు దగు సహాయుండు భూ వల్లభునకు.

క. తిలలును నీళ్ళును వస్త్రం, బులుఁ
బుష్పసుగంధ వాసమున సౌరభముం
బోలు పెసఁగఁదాల్చుఁగావున,
వలయక సత్సంగమమున నగు సద్గుణముల్.

క. శోకభయ స్థానంబు ల,
నేకంబులు గలిగినను విహీనవివేకుం
డాకులతఁ బొందునట్లు వి,
వేకముగలవాఁడు బుద్ధి వికలుం డగునే.

క. శారీరమానసమహా,
దారుణదుఃఖములఁజేసి తఱిఁగి శరీరుల్
క్రూరతరబాధఁ బొందుదు,
రారెంటిని జెఱుతు రాప్య్తలమలినబుద్ధిన్.

వ. వ్యాధిశ్రమా నిష్టసంస్పర్శనేష్ట వివర్జనంబు లనునాల్గింటం బుట్టి శారీర దుఃఖంబు లాశుక్రియాది ప్రతియోగంబుల నుపశమిల్లు మఱి స్నేహజంబు లయిన మానస దుఃఖంబులు జలంబుల నగ్ని యుప శమిల్లువట్లు విమలజ్ఞానం బునంజేసి యుపశమంబునం బొందు.

క. స్నేహా వమగ్నుం డయి,
దేహి మహాదుఃఖముల నధృతిఁ బొందును దుః
ఖాహతుఁడు శోకతాపవి,
మోహియగు స్నేహ మూలములు రాగాదుల్.

వ. కావున బంధుమిత్ర ధనసంచయంబులవలని స్నేహంబు విడుచు వది పద్మ పత్రంబు నీరం బొందనియ ట్లెఱుక గలవారి నెట్టియెడలను స్నేహంబు వొందదు స్నేహంబున రాగంబును రాగంబునం గామంబును గామంబునం గ్రోధంబును గ్రోధం బునం దృష్ణయు వర్తిల్లు,

క. అది సర్వదోషముల కా,
స్పద మది దురితక్రియానుబంధంబులకున్
మొదలు నిరంతరదుఃఖ,
ప్రద మని మది దలఁచి తృష్ణఁ బాతురు సుమతుల్.

వ. మఱియుఁ దృష్ణాతురం దర్పలోభంబునం గోటరస్థం బయిన యనలంబునంజేసి దగ్ధం బగువృక్షంబునుంబోలె వినాశంబునం

బొందు నర్థాసక్తుం డైనవాఁడు శరీరంబులు వదయనోపండు
మృత్యువువలనం బ్రాణులకు భయంబు గలుగున ట్లర్థవంతు
లకు రాజ చోరస్వజనజలానలంబుల వలన భయంబు
నియతంబు.

తే. జలము లందు మత్స్యంబులు చదలఁబక్షు,
లామిషం బెట్లు భక్షించునట్లు దివిరి
యెల్లవారును జేరి యనేకవిధుల,
ననుదినంబును భక్షింతు రర్థవంతు.

క. అర్థమె యనర్థమూలం,
బర్థమ మాయా విమోహ నావహము నరుం
డర్థార్జనదుఃఖమున న,
పార్థీకృత జన్ముఁడగుట పరమార్థ మిలన్.

ఆ. కార్యగతుల తెఱఁగు కలరూపు చెప్పిన,
నధికమతులు దాని నాదరింతు
రల్ప కార్యబుద్ధు లగువారలకు నది,
విరసకారణంబు విషమపోలె.

ఆ. ఎల్ల నెయ్యములకుఁ దల్లిదండ్రు లయందు,
సుతులవలని నెయ్య మతిశయంబు
ధనము లెంతగలిగినను సుతరహితుల,
కెమ్మెయిని మనః ప్రియమ్ము లేదు.

సీ. క్రోధంబు పాపంబు క్రోధంబుననచేసి యగు,
జీవ్వ ధర్మకామార్థహాని
గదుఁ క్రోధి గర్జంబు గానందు
క్రుద్ధుండు గురునైన నిందించుఁ గ్రుద్ధుడైన

వాఁ డవధ్యులనైన వధియించు మఱి
యాత్మఘాతంబు సేయంగఁగడఁగుఁ గ్రుద్ధుఁ
డస్మాదృశులకు ధర్మానుబంధుల
కిట్టి క్రోధంబు దాల్చుట గుణమె చెపుమ

ఆ. యెఱుకగలమహాత్ముఁ డెఱుకయ జ్జలముల,
నార్చుఁ గ్రోధమనుమహానలంబు
క్రోధవర్జితుండు గుఱుకొని తేజంబు,
దాల్చు దేశకాల తత్త్వ మెఱిఁగి.

క. క్షమ గలవానికిఁ బృథ్వీ,
సమునకు నిత్యంబు విజయసంసిద్ధి యగున్
క్షమి యైనవాని భుజవి,
క్రమము గడున్ వెలయు సర్వకార్యక్షమమై.

తే. అధికదుఃఖరోగార్తున కౌషధంబు,
సురుచిరఁబుగ భార్యయ చూవె యెందు
నానర భార్యాసమేతుఁడై యున్నవాని,
కెంతలయ్యును నాపద లెఱుకపడవు.

ఉ. శారదతత్రుతు లుజ్జ్వలలసత్తర తారకహారపంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీరసౌరభము తాల్చి సుధాంశువికీర్యమాణక
ర్పూరపరాగపాండురుచిపూరములం బరిపూరితంబులై.

సంప్రదించిన గ్రంథాలు

౧. ఆంధ్రదేశ చరిత్ర-సంగ్రహం

—డాక్టర్ మల్లంపల్లి సోమశేఖరశర్మ

౨. వేంగీ సంచిక

—ఆంధ్ర హిస్టారికల్ రిసెర్చి సొసైటీ,-రాజమండ్రి

౩. ప్రాఙ్నన్నయ యుగము

—డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

౪. విజ్ఞాన సర్వస్వం—తెలుగు సంస్కృతి

—తెలుగు భాషా సమితి

౫. విజ్ఞాన సర్వస్వం-విశ్వసాహిత్యం

—తెలుగు భాషా సమితి

౬. తెలుగు సాహిత్యంపై మరోచూపు

—ఆంధ్ర సారస్వత పరిషత్తు

౭. భారతదేశ చరిత్ర

—శ్రీ గడియారం రామకృష్ణ శర్మ

అంతర్జాతీయ తెలుగు సంస్థ ప్రచురణలు

		వెల
	తెలుగువాణి మాసపత్రిక సాలుసందా	15-00
1.	మారిషస్‌లో తెలుగువాణి – వేమూరి రాధాకృష్ణమూర్తి	2-00
2.	బర్మాలో తెలుగువాణి – కె. కె. మూర్తి	3-00
3.	పండుగలు – పర్వాలు – జి. లక్ష్మీనారాయణ	4-00
4.	తెలుగు వాచకాలు 1, 2, 3, 4, 5 – సి. రామచంద్రరావు ఒక్కొక్కటి	5-00
5.	Learn Modern Telugu 1, 2, 3– *Dr. N. Sivaramamurty* each	10-00
6.	Vernacularization of Literacy - The Telugu Experiment–*Dr. M.W.S De Silva*	4-75
7.	ఆధునిక తెలుగు వ్యాకరణం, డా॥ ఎన్. శివరామమూర్తి	12-00
8.	Position and Function of Telugu (Articles) —*Dr. Moturi Satyanarayana*	4-50
9.	మలేషియా, నాడు – నేడు – ద్వివేదుల విశాలాక్షి	4-00
10.	Historical Tables —*K. Satyamurty*	16-00
11.	వీరేశలింగవాణి – డా॥ ఎ. రమాపతిరావు	3-75
12.	Flowers of Wisdom –*Dr. S. Radha Krishnamurty*	3-00
13.	బాలశిక్ష – డా॥ యన్. శివరామమూర్తి	9-00
14.	స్మారకోపన్యాసాలు	3-00
15.	Memorial Lectures	3-00
16.	మార్గదర్శి నన్నయభట్టు – దేవులపల్లి రామానుజరావు	2-50
17.	రెండవ ప్రపంచ తెలుగు మహాసభల సావనీరు	30-00
18.	Telugu Culture	10-00
19.	Itihas Special, on Temples of Andhra Pradesh	65-00
20.	Proceedings of the 2nd World Telugu Conference	50-00